



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక





సంపుటి: 4 సంచిక: 300, పేజీలు - 08

మంగళవారం, మార్చి 18, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati



## ఆదాయం తగ్గి అప్పులు పెరిగినా

# ధైర్యం కోల్పోలేదు

**- ఆర్థిక పరిస్థితిపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**

- మంత్రులను తొలగిస్తేనే పాలనపై పట్టు ఉన్నట్లా.?
- ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి
- పథకాల అమలులో పారదర్శంగా వ్యవహరించాలని ఆదేశించామన్న ముఖ్యమంత్రి
- ఎస్సీ వర్గీకరణ కోసం మూడున్నర దశాబ్దాలుగా ఉద్యమం జరుగుతోందని వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ ఆదాయం తగ్గినా అప్పులు పెరిగినా ధైర్యాన్ని కోల్పోలేదు ప్రజలకు అన్ని విషయాలు చెప్పి పరిపాలన చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అబద్ధాల ప్రాతిపదికన ప్రభుత్వాన్ని నడపదలచుకోలేదన్నారు. అందుకే దుబారా తగ్గించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళు తున్నామని ఇసుక, ఇతర విధానాలను స్ట్రీమ్ లైన్ చేస్తూ ప్రభుత్వ ఆదాయం పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గతంలో ఇసుకపై ప్రభుత్వానికి కోటిన్నర ఆదాయం వస్తే ఇప్పుడు ఇసుక ఆదాయం మూడున్నర కోట్లకు పెరిగింది . పన్నుల వసూలులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. నిరుద్యోగ సమస్యను 8.8 నుంచి 6.6 కి వచ్చిందన్నారు. రాజీవ్ యువ వికాసం కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించిన సభలో రేవంత్ మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ఇన్ఫ్లేషన్ లో 1.3 తో దేశంలోనే తెలంగాణ ముందు ఉందని, ఇది తాము చెప్పేది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన గణాంకాలన్నారు. రూ.6000 కోట్లతో 5 లక్షల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని శాసన సభ ప్రాంగణంలో ఒక మంచి కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషమన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచే కార్యక్రమాన్ని ఇదే ప్రాంగణంలో ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు.ఈ 15 నెలల్లో 57 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసుకున్నాం 50 లక్షల కుటుంబాల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వెలుగులు చూస్తున్నాం 43 లక్షల కుటుంబాలు రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలిపారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు 1 కోటి 30 లక్షల నాణ్యమైన చీరలు అందించే ప్రయత్నం

2లో..

## మోదీ సర్కారు ప్రజలను

# దోచుకుంటోంది

**- బీజేపీపై మల్లికార్జున ఖర్గే నిప్పులు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడి చమురు ధరలు తగ్గినా దాని ప్రయోజనాలను ప్రజలకు అందించడంలో సర్కారు విఫలం అవుతుందని అన్నారు. ముఖ్యంగా 42 నెలల కనిష్టానికి ముడి చమురు ధరలు పడిపోయినా ఇప్పటికే ప్రభుత్వం ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూనే ఉందన్నారు. ఇలా దేశ ప్రజలు అందరినీ మోదీ సర్కారు దోచుకుంటుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. కానీ పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గట్లేదని చెప్పారు. 2014 మే నుంచి సుమారు 34 శాతం తగ్గాయని పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం 36 లక్షల కోట్ల రూపాయల పన్ను వసూలు చేసిందని వివరించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెడుతున్నారని చెప్పారు. ఇంకా ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుందంటూ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐ పరిశోధకుడు మరియు పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్‌తో పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ పాల్గొనగా దాన్ని తీవ్రంగా విమర్శించారు ఖర్గే. ముఖ్యంగా

2లో..

## ఇందిరమ్మ రాజ్యం అంటే ఆడబిడ్డలను

# జైలులో పెట్టడమేనా

**- రేవంత్‌పై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై కేసులు పెడతారా అంటూ రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఇందిరమ్మ రాజ్యం అంటే ఆడబిడ్డలను జైలులో పెట్టడమేనా అంటూ రేవంత్ తీరుపై మండిపడ్డారు. రేవంత్ అనే పిచ్చోడి చేతిలోని రాయిలెక్క తెలంగాణ మారిందని విమర్శించారు. 420 బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు జనం నిలదీస్తుంటే సిఎం తట్టుకోలేకపోతున్నాడని, ఒకప్పుడు రేవంత్ మాట్లాడే బజారు భాషలోనే జనం ప్రశ్నిస్తే తప్పేముందన్నారు. ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులతో చంచల్‌గూడ జైల్లో ఉన్న జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్‌ను పరామర్శించిన

2లో..

## వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో రూ. 250 కోట్ల అవినీతి

**- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ ఉపాధి హామీ పథకంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసెంబ్లీలో ఆరోపించారు. ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో

2లో..

# ఎస్సీ వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో తీర్మానం

**- ఏపీ కేబినెట్ భేటీలో నిర్ణయం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో ఏపీ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందులో భాగంగానే రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఇళ్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనే ప్రతిపాదనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించనున్నారు. అలాగే పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. మరోవైపు ఏపీ కేబినెట్ భేటీలో మరికొన్ని కీలక ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు ఏపీ కేబినెట్ పచ్చజెండా ఊపింది. అమరావతిలో భూ కేటాయింపులపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపైనా ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం చర్చించినట్లు తెలిసింది. ఎస్సీ వర్గీకరణపై రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ సమర్పించిన నివేదికకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం

2లో..

## గ్రీన్ ఎనర్జీపై తెలంగాణ

# కీలక నిర్ణయం

**- తరలిరానున్న భారీ పెట్టుబడులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రానికి తక్కువ ధరతో, కాలుష్యరహితంగా విద్యుత్ అందించడమే లక్ష్యంగా సమగ్ర గ్రీన్ పవర్ పాలసీని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రీన్

2లో..

# చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ 2047 అదుర్స్

**- 2047 విజన్ డాక్యుమెంట్‌పై సీఎం ప్రెజెంటేషన్**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వాటిని అమలు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలు సంకల్పం తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ముందు కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసినట్టు చెప్పారు. సోమవారం జరిగిన శాసనసభ సమావేశంలో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్-2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల-2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించి, ప్రజెంటేషన్ ఇచ్చారు. నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్‌ను సఫలీకృతం చేసుకునేందుకు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తున్నామని, దీనికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

### స్వర్ణాంధ్ర-నియోజకవర్గాలు 2047 విజన్

వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఏటా 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. 2047 నాటికి రాష్ట్రాన్ని

2లో..



# యూనివర్సిటీల పేరు మార్పుపై క్లారిటీ

**- అసెంబ్లీలో సీఎం రేవంత్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో వర్సిటీల పేర్ల మార్చడంపై విపక్షాలు చేస్తున్న విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాజకీయాలు కలుషితమయ్యాయో నాయకుల ఆలోచనలు కలుషితమయ్యాయో తెలియడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా విడిపోయిన తర్వాత పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నామని అందులో భాగంగానే పేర్లు మార్చడం జరుగుతుందన్నారు. అయితే అందుకు కులాల పేరుతో రాజకీయం

2లో..

## తెలంగాణా బడ్జెట్ సమావేశాల్లో

# ఐదు కీలక బిల్లుల ఆమోదం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాలుగో రోజు కొనసాగాయి. సోమవారం తెలంగాణ అసెంబ్లీలో ఐదు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఐదు ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెట్టడానికి ముందు అసెంబ్లీ సమావేశాల నుండి ఎంఐఎం సభ్యులు వాకౌట్ చేశారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరును నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు. అసెంబ్లీని అసెంబ్లీ మాదిరిగా నడపాలని ఎంఐఎం సభ్యులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

### సోమవారం సభలో కీలక బిల్లులు

ఎంఐఎం సభ్యుల వాకౌట్ అనంతరం అసెంబ్లీ సమావేశాలలో నేడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు.తెలంగాణ ఎస్సీ హేతుబద్దీకరణ బిల్లు 2025, తెలంగాణవెనుకబడిన తరగతుల, ఎస్సీ, ఎస్టీ విద్యా సంస్థల్లో సీట్లు, రాష్ట్ర సర్వీసుల్లో నియమకాలు, పదవుల

2లో..

2లో..

# తెలుగు వర్శిటీ పేరు మార్పుపై బీజేపీ విమర్శలు

**- మహనీయుడ్ని అవమానించారని ఆగ్రహం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చడాన్ని బీజేపీ వ్యతిరేకించింది. అసలు పొట్టి శ్రీరాములు పేరు ఎందుకు మార్చాల్సి వచ్చిందని అసెంబ్లీలో ఆ పార్టీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్శిటికీ సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సూచించారు. పొట్టి శ్రీరాములు పేరు మార్చడం అవివేకమైన చర్య అని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు ఒక ప్రాంతానికే పరిమితమైన వ్యక్తి కాదన్నారు.ఆయన తెలుగువారందరి కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు.ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతలు కూడా తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. పొట్టి శ్రీరాములు తెలుగు భాష, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడని ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి గుర్తు చేశారు. అటువంటి గొప్ప త్యాగమూర్తి పేరు మీద ఉన్న "పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం" పేరును మార్చడం తెలుగు భాషను, కోట్ల మంది తెలుగువారి గౌరవాన్ని అవమానించే చర్య అని విమర్శించారు. కాంగ్రెస్‌కు గాంధీ కుటుంబం తప్ప ఏ స్వాతంత్ర్య సమరయోధుల గౌరవించడం తెలియదని ఆరోపించారు.

2లో..

## ఆదాయం తగ్గి అప్పులు పెరిగినా

# ధైర్యం కోల్పోలేదు

చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 29,500 ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలల నిర్వహణ ఆడబిడ్డలకు అప్పగించామని గుర్తు చేశారు. కులగణన సమాజానికి ఎక్స్ రే లాంటిదని రాహుల్ గాంధీ చెప్పారని కులగణన నిర్వహించి బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించుకుంటున్నామని కులగణనలో బీసీల లెక్క 56.36 శాతంగా తేలింది వారికి 42 శాతం రిజర్వేషన్లు అందించాలన్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు బిల్లును కూడా సభ ముందుకు తీసుకొచ్చాం దీనిని ఆమోదించుకుని ఎస్సీలకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పరిపాలనను ప్రక్షాళన చేస్తూ పారదర్శక విధానంతో ముందుకు వెళు ్తన్నాం రాజీవ్ యువ వికాసం ద్వారా రో. 50వేల నుంచి రూ. 4లక్షల వరకు మంజూరు చేసేందుకు దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించుకున్నాం జూన్ 2 న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా నియోజకవర్గానికి 4 నుంచి 5 వేల మందికి ఉపాధి కలిగించొచ్చని నిజమైన నిరుద్యోగులకు ఇది అందాలి వారికిది ఉపయోగపడాలని రేవంత్ స్పష్టం చేశారు. ఉద్యోగాల భర్తీ, టీచర్ల బదిలీలు ఎలాంటి ఆరోపణ లేకుండా పారదర్శకంగా నిర్వహించామని పథకాల అమలులో పారదర్శకంగా ఉండాలి అప్పుడే ప్రజలకు మెరుగైన పాలన అందించగలుగుతామన్నారు. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాంమని చెప్పారు.

### 200 యూనిట్ల ఉచిత విద్యుత్

తొలి ఏడాదిలోనే 54 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్న సీఎం రేవంత్ రెడ్డి తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదని అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే మహిళలకు 1.20 కోట్ల చీరలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. స్వయంసహాయక సంఘాల్లోని 63 లక్షల మంది మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇస్తామని హామీ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల మహిళలకే పాఠశాలల నిర్వహణ బాధ్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

### ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ

తనకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారని, మంత్రివర్గం నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా?, అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్లా? అని ప్రశ్నించారు. అన్నింటిని సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే తన విధానమని, అందరికీ ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని, ప్రభుత్వ పథకాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని తమ ఎమ్మెల్యేలకు చెప్తుంటానని వెల్లడించారు. కార్యకర్తలకే ఇవ్వాలంటే పార్టీ పదవులు ఇద్దామని చెప్తుంటానని, ప్రభుత్వ పథకాల విషయంలో మాత్రం పార్టీలను చూడొద్దని చెప్తున్నానని అన్నారు. అసలైన అర్హులకు పథకాలను తప్పక వర్తింపచేయాలని అధికారులను చెప్తుంటానని తెలిపారు.

# ఐదు కీలకబిల్లుల ఆమోదం

### దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉంది

స్వాతంత్ర్యం వచ్చి ఈ 75 ఏళ్లు పూర్తయినా ఇప్పటివరకు దేశంలో కులగణన జరగలేదని, సమాజానికి ఎక్స్ రే వంటి కులగణన దేశమంతా జరగాలని రాహుల్‌గాంధీ చెప్పారని సీఎం అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు కూడా ప్రవేశపెట్టామని, ఎస్సీల వర్గీకరణ కోసం 35 ఏళ్లుగా ఉద్యమం సాగుతోందని, దశాబ్దాలుగా నానుతున్న ఎస్సీ వర్గీకరణపై కూడా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. అబద్ధాల పునాదుల మీద మేము ప్రభుత్వాన్ని నడపలేమని అన్నారు. గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడిందని ఆరోపించారు. దుబారా ఖర్చులను తగ్గించుకుంటూ అప్పులు చెల్లిస్తున్నామని, ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ.3 కోట్లు పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైందని, ధరల పెరుగుదలను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందని వివరించారు.

## మోదీ సర్కారు ప్రజలను

# దోచుకుంటోంది

ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌ను ప్రజలకు సుదీర్ఘమైన ఏకపక్ష పాడ్‌కాస్ట్‌ల ద్వారా మాత్రమే చెబుతారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం త్వరలో అమల్లోకి తేబోతున్న లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన అంశంపై కూడా స్పందించారు. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేస్తుందని చెప్పారు. దేశ వనరులు, పాలనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం ఉండాలని అన్నారు. జనాభా ఆధారంగా నియోజక వర్గాల పునర్విభజన చేయడం వల్ల దక్షిణాదిలో ఎంపీ సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఉత్తరాదిలో ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. దీని వల్ల దేశంలో సమన్యాయం లేకుండా పోతుందని మల్లికార్జున్ ఖర్గే వివరించారు. ఇలాంటివి జరగకుండా సమాజిక సమానత్వం కోసం అంతా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే ఆడబిడ్డలను జైలులో పెట్టడమేనా
కేటీఆర్ ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

### రేవంత్ రెడ్డికి మా కుటుంబం గుర్తు రాలేదా.?

తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తన భార్యా పిల్లలను దూషిస్తున్నారని బాధపడుతన్నారు, గతంలో తమ మీద అడ్డగోలుగా అవాస్తవాలు మాట్లాడిన సంగతి మర్చిపోయారా అని కేటీఆర్ ప్రశ్నించారు. తన పిల్లల ప్రస్తావన తీసుకొచ్చినప్పుడు రేవంత్‌కు కుటుంబం గుర్తుకురా లేదా అని నిలదీశారు. రేవంత్ మాట్లాడితే మంచిది, అవే మాటలు వేరొకరు మాట్లాడితే మంచిది కాదా? అన్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలన్నారు కేటీఆర్. రేవంత్ మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే జర్నలిస్టులపై ముఖ్యమంత్రి అక్కసు వెళ్ళగక్కుతున్నారని మండిపడ్డారు. జనం నిలదీస్తే ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపుతారా? జైలుకు పంపుతారా? ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్న డిజిటల్ జర్నలిస్టులపై అక్రమ కేసులు, దాడులతో వేధించడం ప్రజాస్వామ్య హననమే" అన్నారు కేటీఆర్. ఒకరిద్దరు జర్నలిస్టులపైనే కాదు పదుల సంఖ్యలో జర్నలిస్టులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేధిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఎంతో గొప్పగా చెప్పిన మొహబత్‌కి దుకాణ్ అంటే ఇదేనో కాదో చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. జర్నలిస్టులను బట్టలు ఊడదీసి కొడతానని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. ప్రజల ఆక్రోశాన్ని చూపించడమే రేవతి, తన్వి యాదవ్ చేసిన తప్పా? అని ప్రశ్నించిన కేటీఆర్, రేవంత్ నియంతృత్వ పోకడలను అడ్డుకోకుంచే మిగతా జర్నలిస్టులకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి అక్రమాలపై మీడియా గొంతు విప్పి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

### ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ..

కాంగ్రెస్ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం అంటే అదేదో సంక్షేమ రాజ్యం అని ప్రజలు భ్రమపడి, కెసిఆర్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అపోహ పడ్డారని తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహార శైలిని చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రోజులే అన్న సంగతి మరోసారి స్పష్టమైందని ఆరోపించారు. 6 గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యమని పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, ప్రజలు గొంతు విప్పితే మాత్రం తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రజలు అంతా ఓపెన్‌గా మాట్లాడుకుంటున్నారని చెప్పారు. జైల్లో పెడతామంటే భయపడ్డానికి బీఆర్ఎస్‌లో ఎవరూ లేరన్న కేటీఆర్, తామంతా ఉద్యమాల నుంచి వచ్చామన్నారు. ప్రభుత్వ బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడే వాళ్ళంకాదని స్పష్టం చేశారు. అధికారమదంతో విర్రవీగుతున్న రేవంత్ రెడ్డికి రేపు కచ్చితంగా తగిన శాస్తి జరుగుతుందన్నారు. ఆయనకు వంతపడే వాళ్లకు కూడా సేమ్ టూ సేమ్ జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

### రేవంత్ అసమర్ధత వల్లే తెలంగాణకు ఆదాయం తగ్గింది..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 71 వేల కోట్ల ఆదాయం తగ్గిందన్న రేవంత్ రెడ్డి, అన్ని రంగాల్లో తెలంగాణ విఫలమైన సంగతిని స్వయంగా ఒప్పుకున్నారని కేటీఆర్ చెప్పారు. రేవంత్ అసమర్థ విధానాల వల్లనే ఆదాయం తగ్గిందన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణలో అన్ని రంగాలు చాలా బాగున్నాయి అని చెప్పుకున్న రేవంత్ రెడ్డి, 71 వేల కోట్ల ఆదాయం ఎలా తగ్గిందో ప్రజలకు చెప్పాలన్నారు. తెలంగాణ రైజింగ్ కాదు తెలంగాణ ఈజ్ ఫాలింగ్ అన్న చేదు నిజాన్ని ముఖ్యమంత్రి కన్ఫర్మ్ చేశారన్నారు కేటీఆర్.

## వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో

# రూ. 250 కోట్ల అవినీతి

జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందని పవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు 564 మండలాల్లో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించిందని తెలిపారు. ఈ పరిశీలనలో అనేక అవకతవకలు బయటపడ్డాయని, ఉపాధి హామీ కింద ఖర్చు చేసిన నిధులపై అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పథకం ద్వారా వచ్చిన నిధులు లబ్ధిదారులకు చేరకుండా కొందరు మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లాయని డిప్యూటీ సీఎం ఆరోపించారు.ఇప్పటికే మొదలైన ఆడిట్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా మిగిలిన మండలాల్లో కూడా పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పనులను సమీక్షించి, అవినీతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇక ఉపాధి హామీ కూలీలకు వేతనాల పెంపు అంశం అనేది కేంద్రం పరిధిలో ఉంటుందని పవన్ వెల్లడించారు.

# ఎస్సీ వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో తీర్మానం

తెలిపింది. మరోవైపు అనంతపురం, సత్యసాయి జిల్లాలకు ఏపీ కేబినెట్ తీపికబురు వినిపించింది. అనంతపురం, సత్యసాయి జిల్లాలలో రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అలాగే నంబూరులోని వీవీఐటీయూకు ప్రైవేటు యూనివర్సిటీ హోదా కల్పించే ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ కేబినెట్ ఆమోదం తెలిపింది. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పేరును తాడిగడప మున్సిపాలిటిగా మార్పుచేశారు. వీటితో పాటుగా పలు సంస్థలకు భూ కేటాయింపులపైనా నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు ఎస్సీ, ఎస్టీలకు ఇప్పటి వరకూ ఉచిత విద్యుత్ అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే చేనేత కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కేబినెట్ నిర్ణయించింది. అలాగే పవర్ లూమ్స్‌కు సైతం 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించనున్నారు.

# యూనివర్సిటీల పేరు మార్పుపై క్లారిటీ

చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టిన తర్వాత గత పదేళ్లలో యూనివర్సిటీల పేర్లు మార్చడానికి గల కారణాలను వెల్లడించారు. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకుంటున్నామన్నారు ముఖ్యమంత్రి. రాష్ట్ర పునర్విభజన తరువాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో పెట్టిన పేర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలకు తెలంగాణలో పేర్లు మార్చామన్నారు.ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలు ఉంటే పరిపాలనలో గందరగోళం ఉంటుందని అన్నారు. అందుకే తెలంగాణ లోని యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ పేర్లు పెట్టుకుంటున్నామని క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టామన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు, వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టుకున్నామని తెలిపారు. అంత మాత్రానా వైఎస్ఆర్, ఎన్టీఆర్ ను అగౌరవపరిచినట్టు కాదన్నారు. ఇప్పుడు అలానే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు మార్చడం జరుగుతుందన్నారు. ఎవర్ని అవమానపరచడం, తక్కువ చేయడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. గుజరాత్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియం పేరు తొలగించి ప్రధాని మోదీ పేరు పెట్టిన విషయాన్ని బీజేపీ నేతలకు గుర్తు చేశారు. ప్రాణత్యాగాలు చేసిన వారిని తక్కువ చేయడం లేదని వారి ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాలన్నారు. తెలంగాణలో నూతనంగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామన్నారు. ఈ విషయంలో చిత్తశుద్ధి ఉంటే కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలని సూచించారు. బల్కంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్ కు మాజీ సీఎం రోశయ్య పేరు పెడతామని సూచించారు. రోశయ్య సేవలను కీర్తించుకునేలా అక్కడ ఆయన విగ్రహాన్ని కూడా ఆవిష్కరించుకుందాని పిలుపునిచ్చారు.

# గ్రీన్ ఎనర్జీపై తెలంగాణ కీలక నిర్ణయం

పవర్ పాలసీకి పెట్టుబడుదారులు ముందుకు వస్తున్నారు. 80 వేల నుంచి లక్ష కోట్ల వరకు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు కొన్ని కంపెనీలతో ఎంఓయూలు చేసుకున్నట్టు తాజాగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ రంగంలో అనేక మార్పులు వచ్చినప్పటికీ గత 10 ఏళ్లు ఈ రంగంలో ఒక పాలసీ లేదు. 2030 నాటికి 20వేల మెగావాట్లు, 2040 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగనుంది. ఇప్పటికే సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ వంటి విభాగాల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రీన్ పవర్‌లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నారు. అంతేకాదు స్టాంప్ డ్యూటీని రియంబర్స్మెంట్ చేయడంతోపాటు, నాలా కన్వర్షన్ సులభతరం చేశారు. తెలంగాణలో రోజురోజుకు విద్యుత్తు డిమాండ్ ఊహించన రీతిలో పెరుగుతోంది. దానిని అందుకునేందుకు ప్రభుత్వ ఖాళి భూములతోపాటు దేవాదాయ శాఖ ఖాళీ భూముల్లో, సాగునీటి శాఖలో సోలార్, ఫ్లోటింగ్ సోలార్ ద్వారా గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఇప్పటికే ప్రణాళికలలు సిద్ధం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి జెన్‌కోతో ఎంఓయూ చేసుకున్నారు. ప్రభుత్వ ఖాళీ భూములను స్వయం సహాయక సంఘాల మహిళలకు లీజుకు ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మహిళ సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వం కొనడం ద్వారా మహిళలను ప్రోత్సహించడంతోపాటు రాష్ట్ర విద్యుత్ అవసరాలను సైతం తీర్చవచ్చని భావించారు. అంతేకాదు ఈ రంగంలో యువతను ప్రోత్సహించడంతోపాటు, ప్రభుత్వ ఉద్యోగాలు రానివారు బ్యాంకుల సహకారంతో స్వయం ఉపాధికి గ్రీన్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా ఉపాధి పొందే అవకాశం ఉంది. రాష్ట్రంలోనే కాదు దేశంలో ఎక్కడ గ్రీన్ పవర్ ఉన్నా అందిపుచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందుకే ఇటీవల రాజస్థాన్ ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు చేసుకున్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు రిజిస్ట్రేషన్‌లో టాక్స్ ఫ్రీ చేశారు. ఫలితంగా రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాల అమ్మకాలు పెరిగాయి. దీనికి తోడు ఇటీవల దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పర్యటనతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు రాష్ట్రానికి వచ్చారు. వారు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు, ఆ సర్వే తరువాత రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8,938 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి జరుగుతుందని 2040 నాటికి 40వేల మెగావాట్లు రాష్ట్రంలో ఉత్పత్తి చేసే సంకల్పంతో ముందుకు సాగుతోంది రేవంత్ సర్కార్. దూర ప్రయాణం చేసే వారిని దృష్టిలో పెట్టుకొని ఎవరైనా ముందుకు వస్తే ఎలక్ట్రికల్ చార్జింగ్ స్టేషన్‌లు పెట్టుకునేందుకు అన్ని అనుమతులు ఇచ్చేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉంది. తీవ్ర వాతావరణ కాలుష్యం మూలంగా ఢిల్లీ పట్టణ ప్రజలు ఒక సీజన్‌లో మూడు నెలల పాటు వలస వెళ్లిపోతున్నారు. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూడాలని ఎలక్ట్రికల్, బ్యాటరీ బేస్డ్ బస్సులు ప్రవేశ పెడుతూ, డీజిల్ బస్సులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. హైదరాబాద్ సిటీలో కొత్తగా డీజిల్ ఆటోలకు అనుమతి ఇవ్వడం లేదు బ్యాటరీతో నడిచే ఆటోలను ప్రోత్సహిస్తున్నారు. కాలుష్య కారకాలను నగరం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వైపుకు తరలించాలనే ఆలోచనలో ఉన్నారు. రాష్ట్రం కొత్తగా తీసుకువచ్చిన గ్రీన్ పవర్ పాలసీకి సంబంధించిన పూర్తి సమాచారం ఆన్లైన్లో అందరికీ అందుబాటులో ఉంచడం ద్వారా అవగాహన కల్పించేందుకు సిద్దమైయ్యారు.

## తెలుగు వర్శిటీ పేరు మార్పుపై

# బీజేపీ విమర్శలు

స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ నుంచి, తెలుగువారి గౌరవంగా నిలిచిన పీవీ నరసింహరావు రకు స్వంత పార్టీ కాంగ్రెస్ నేతలను సైతం ఎవ్వరినీ గౌరవించలేదని విష్ణువర్ధన్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు అదే ద్వేషంతో, తెలుగు భాష కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును ఆయన జన్మదినానే తొలగించడం కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగువారిపై చూపుతున్న బాధ్యతా రాహిత్య చర్యలకు ఈ నిర్ణయమే ఒక నిదర్శనమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజమైన ప్రజాస్వామ్యవాదివైతే, హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి పేరు మార్చగలరా అని ప్రశ్నించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, తెలుగు ప్రజలను కించపరిచే ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి తెలుగు బిడ్డ ఈ అవమానాన్ని తీవ్రంగా ఖండించాలి. బీజేపీ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, పొట్టి శ్రీరాములు పేరు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పై పోరాటం చేస్తుందని విష్ణువర్ధన్ రెడ్డి ప్రకటించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలంతా పొట్టి శ్రీరాములను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందని విమర్శలు చేస్తున్నారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటే ఆడబిడ్డలను

# జైలులో పెట్టడమేనా

రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా ప్రభుత్వ ఆశయం. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తాం. దీనికి 'సూక్ష్మం నుంచి సూక్ష్మం' అనే విధానాన్ని అనుసరిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో, ఇప్పుడు నియోజకవర్గస్థాయిలో విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం.

### 2047-48 నాటికి ఆర్థిక వృద్ధి అంచనాలు

వ్యవసాయం-అనుబంధ రంగాల ఆదాయం : 2024-25 కాలానికి రూ.5,17,482 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ ఆదాయం రూ.6,02,728 కోట్లు అవుతుందని అంచనా. 2028-29 నాటికి రూ.8,91,331 కోట్లకు చేర్చడం లక్ష్యం. పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయం : 2024-25 కాలానికి రూ.3,40,387 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ ఆదాయం రూ.3,99,358 కోట్లకు ఉంటుందని అంచనా. 2028-29 నాటికి రూ.6,32,748 కోట్లకు చేరుతుందని భావిస్తున్నాం. సేవల ద్వారా ఆదాయం : 2024-25 కాలానికి రూ.6,12,045 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ ఆదాయం రూ.7,10,714 కోట్లకు ఉంటుందని అంచనా. 2028-29 నాటికి రూ.11,69,728 కోట్లకు పెరిగేలా చూస్తాం. ఇక 2047-48 నాటికి వ్యవసాయం, అనుబంధరంగాల ఆదాయం రూ.52,56,052 కోట్లు, పరిశ్రమల ఆదాయం రూ.74,00,083 కోట్లు, సేవారంగం రూ.1,55,88,891 కోట్లకు చేరుకునేలా రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను అమలు చేస్తాం. ప్రస్తుత ధరల్లో జీఎస్డీపీ : 2024-25 కాలానికి రూ.15,93,062 కోట్లు ఉంటే 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీఎస్డీపీ రూ.18,65,704 కోట్లు, 2028-29 నాటికి రూ.29,29,402 కోట్లు, అలాగే 2047-48 నాటికి రూ.3,08,11,722 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే తలసరి ఆదాయం 2024-25లో రూ.2,98,058 ఉంటే, ఈ ఏడాది రూ.3,47,871, 2028-29లో రూ.5,42,985, 2047-2048 నాటికి రూ.54,60,748కి చేరుకుంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వృద్ధి 2024-25లో 12.02 శాతం ఉండగా, 2025-26కు వృద్ధి 17.11 శాతం, 2028-29కి 16.23 శాతం, 2047-48కి 11.97 శాతం ఉంటుందని అంచనా.

### స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలు

ప్రస్తుతం 5.3 కోట్లుగా ఉన్న జనాభా 2047 నాటికి 5.8 కోట్లకు చేరుకుంటుంది. అలాగే 70.6 ఏళ్లుగా ఉన్న సగటు జీవితకాలం 85 ఏళ్లకు పెరుగుతుంది. పట్టణ జనాభా 36 శాతం 60 శాతానికి చేరుకుంటుంది. 100 శాతం అక్షరాస్యత సాధిస్తాం. నిరుద్యోగ రేటు 4.1శాతం నుంచి 2 శాతానికి తగ్గనుంది. ఎగుమతులు రూ.1.68 లక్ష కోట్ల నుంచి 39.12 లక్షల కోట్లకు వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

### స్వర్ణాంధ్రకు పది సూత్రాలు

స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారానికి 10 సూత్రాలు.. స్వర్ణాంధ్రకు మార్గదర్శకాలు. 1. పేదరికం లేని సమాజం, 2. ఉద్యోగ, ఉపాధి కల్పన, 3. నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, 4. నీటి భద్రత, 5. ఫార్మర్ అగ్రిటెక్, 6. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, 7. ఇంధన వనరుల సమర్థ వినియోగం, 8. నాణ్యమైన ఉత్పత్తులు, 9. స్వచ్ఛాంధ్ర, 10. డీప్ టెక్.

### విభాగాల వారీ థీమ్ విజన్

రాష్ట్ర విజన్, విభాగాల వారీ థీమ్ విజన్, జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్, మండలం-మున్సిపాలిటీ విజన్ యాక్షన్ ప్లాన్ ఇలా ఐదు దశల్లో విజన్ ఫ్రేమ్ వర్క్ రూపొందించుకుంటున్నాం.

### మండలం-జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్

రాష్ట్రంలోని 686 మండలాలకు సంబంధించి బలాలు, అవకాశాలు గుర్తించాం. మండల స్థాయిలో ప్రాథమిక రంగంపైనా, కీ గ్రోత్ ఇంజిన్స్‌పైనా దృష్టి పెట్టాం. 2028-29 కల్లా విభాగాల వారీగా ఐదేళ్ల లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో ఇవి రూపొందించాం. రాష్ట్రంలోని 26 జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నాం. మౌలిక వసతులు, ఇండస్ట్రియల్ కారిడార్లు అభివృద్ధి చేయడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, గవర్నెన్స్‌కు లక్ష్యాలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో సుస్పష్టంగా ఉన్నాయి.

### నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల అభివృద్ధికి మైక్రో లెవెల్ ప్లానింగ్ అనుసరిస్తున్నాం. ఫిజికల్ అండ్ సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరాలపై దృష్టి పెడతాం. రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ప్రాజెక్టులు చేపడతాం. కుటుంబ స్థాయిలో అభివృద్ధి-సాధికారత సాధించడం, సామాజిక భద్రత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. పీ4 విధానం, జనాభా నిర్వహణ ప్రభుత్వ ప్రాధాన్యాలు.

### 2029 కల్లా హామీలు నెరవేరుస్తాం

ప్రతి కుటుంబానికి కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రతి కుటుంబానికి ఇళ్లు, పారిశుధ్య సౌకర్యం, నీటి సరఫరా, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, డిజిటల్ కనెక్టవిటీ, ఎలక్ట్రిసిటీ, సోలార్ రూఫ్ టాప్, రహదారుల అనుసంధానం, డ్రైనేజీ నెట్వర్క్, వేస్ట్ టు వెల్త్, స్ట్రీట్ లైటింగ్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తాం.

### ప్రణాళికల అమలుకు ఫ్రేమ్‌వర్క్

సచివాలయం, మండలం, మున్సిపాలిటీ, నియోజకవర్గం, జిల్లాల వారీగా విజన్ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. పీ4, జీరో పావర్టీ, బ్లూ ఎకానమీ, నాలెడ్జ్-ఇన్నోవేషన్, పాపులేషన్ మేనేజ్మెంట్ వంటి థీమ్ స్పెసిఫిక్ టాస్క్‌ఫోర్స్‌లను స్టీరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుంది. చివరి అత్యుత్తమ అధికార కేంద్రంగా లీడర్‌షిప్ కౌన్సిల్ పనిచేస్తుంది.

### సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు

నియోజకవర్గం స్థాయిలో విజన్ డాక్యుమెంట్ కార్యరూపం దాల్చేందుకు ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యే చైర్మన్‌గా, జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తాం. వీరికి సహాయంగా ఒక యంగ్ ప్రొఫెషనల్‌ను, జీఎస్‌డబ్ల్యుఎస్ నుంచి ఐదుగురిని నియమిస్తాం. ఈ మొత్తం వ్యవస్థను నియోజకవర్గ విజన్ మానిటరింగ్ యూనిట్ పర్యవేక్షిస్తుంది. ఎమ్మెల్యే, ప్రత్యేకాధికారికి సమర్థత, జవాబుదారీతనం పెంచేందుకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారం చేసుకుని ర్యాంకులను నియోజకవర్గం వారీగా ఇవ్వడం జరుగుతుంది. నెలకోసారి రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖలు డిజిటల్ డ్యాష్ బోర్డు ద్వారా పురోగతిని పరిశీలిస్తాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి 2 నెలలకు ఒకసారి, ముఖ్యమంత్రి 3 నెలలకు ఒకసారి విజన్ డాక్యుమెంట్ అమలును సమీక్షిస్తారు.

# తెలంగాణా బడ్జెట్ సమావేశాల్లో ఐదు కీలక బిల్లుల ఆమోదం

రిజర్వేషన్ బిల్లు 2025, తెలంగాణ ధార్మిక హిందూ, మత సంస్థల ధర్మాదాయాల సవరణ బిల్లు 2025 ను ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టింది.

### బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు

ఎస్సీ హేతుబద్దీకరణ బిల్లును ముఖ్యమంత్రి తరఫున ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ్జనరసింహ, బీసీ బిల్లును బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశ పెట్టారు. స్థానిక సంస్థల్లో, విద్యా ఉపాధి కల్పనలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఈ బిల్లు ప్రతిపాదించింది. ధార్మిక హిందూ, మత సంస్థల ధర్మాదాయాల సవరణ బిల్లును దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శాసన సభలో ప్రవేశపెట్టారు.

### శాసనసభలో బిల్లులు ఆమోదం

ఈ బిల్లులను శాసనసభ ఈ రోజే చర్చకు చేపట్టింది.ఆ తర్వాత ఈ బిల్లులపై పలువురు శాసనసభ్యులు మాట్లాడారు. అనంతరం ఈ బిల్లులు ఆమోదం పొందినట్టు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. కాగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సవరణ బిల్లును ముఖ్యమంత్రి తరఫున ఆరోగ్యమంత్రి దామోదర రాజనరసింహ శాసనసభలో ప్రవేశపెట్టారు.

### పొట్టి శ్రీరాములు పేరు మార్పుపై సీఎం

క్లారిటీ ఈ సందర్భంగా బిల్లు ఉద్దేశ్యాలను వివరిస్తూ, తెలంగాణా వైతాళికుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. అయితే పొట్టి శ్రీరాములు పేరును మార్చటంపై ప్రస్తుతం రగడ కొనసాగుతుంది. గత శాసన సభలోనే పొట్టి శ్రీరాములు పేరు మార్చి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టే బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిపైన సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

## ఉన్నత లక్ష్యాల దిశగా విద్యార్థులు పయనించాలి

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు : రాజారత్నం

-ఘనంగా ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు




వేములవాడ,(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు 9 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి,ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. 2024-25 విద్యా సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లేశం, రాజు, రవీందర్, సలాం, హామీద్, కోటేశ్వర్, బాలచందర్, జ్యోతి, శిరోమణి, స్వరూప ,శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టండి

- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల (ప్రశ్న న్యూస్)జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని భారత పౌర విమానాయ శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రం అందించారు ఢిల్లీలోని కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడును ఆయన కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెడతామని తెలిపి ఆయన పేరు పెట్టకుండా రాయలసీమ ప్రజలను విస్మరించారని విమర్శలు చేశారు. బ్రిటిష్ వారిపై తొలి తిరుగుబాటునేత, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు, రాయలసీమ ముద్దుబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు ఓర్వకల్లు విమానాశ్రాయానికి పెట్టాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించడం పట్ల ఆమె ధన్యవాదములు తెలిపారు.

## అన్నా క్యాంటీన్ లో అల్పాహారాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే



గుంటూరు ( ప్రశ్న న్యూస్) ప్రతి పేదవాడు కడుపునిండా భోజనం తినాలి అనే సంకల్పంతో స్థాపించిన అన్నా క్యాంటీన్ లు సంతృప్తికరంగా నడుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం శివారు ప్రాంతాల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే మిర్చి యార్డు వద్దనున్న అన్న క్యాంటీన్ ను సందర్శించి అక్కడ ప్రజలతో ముచ్చటించి, రైతులతో కలిసి అల్పాహారాన్ని ఎమ్మెల్యే, కమిషనర్ స్వీకరించి, క్యాంటిన్ నిర్వహణ గురించి వాకబు చేశారు. అన్న క్యాంటీన్ లో అల్పాహారం మొదలు భోజనం వరకు చాలా బాగున్నాయని ప్రజలు ఎమ్మెల్యే వద్ద హర్షం వ్యక్తం చేశారు. మిర్చి యార్డుకు స్థానిక రైతు కూలీలతో పాటు ఇతర జిల్లాల నుండి రైతులు వస్తుంటారని, దానికి అనుగుణంగా రోజువారి ఇచ్చే టోకెన్ల సంఖ్యను పెంచే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే కమిషనర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్, ఆడగా పద్మావతి,చెంబేటి మణికుమారి,చంద్రగిరి బాబు,మహబూబ్ సుభాని, శివ, తుమ్మల నాగేశ్వరరావు,ఖాసిం సైదా,బాబు,మామిడి రామారావు, బుడే,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లోని విద్యార్థులకు గీజర్లు ఏర్పాటు చేయండి

- వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్: ఆది శ్రీనివాస్

- అసెంబ్లీలో రాష్ట్ర విద్యార్థుల పక్షాన గళం విప్పిన ప్రభుత్వ విప్ : ఆది



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, సోలార్ పవర్ ఆధారిత గీజర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ శాసనసభలో గురుకులాల నిర్వహణపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు వేకువజామున లేచి చన్నీళ్లతో స్నానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని,అన్నీ హాస్టళ్లలో గీజర్లను అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు.కొన్ని గురుకుల హాస్టళ్లలో ఇప్పటికే సోలార్ పవర్ ఆధారిత గీజర్లు ఉన్నప్పటికీ,చాలా స్కూళ్లలో ఈ సదుపాయం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని,ప్రాముఖ్యత ఉన్న అన్ని గురుకులాల్లో తక్షణమే గీజర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ శాసనసభ వేదికగా ప్రభుత్వానికి సూచించారు.

## కౌలురైతులరక్షణ,సంక్షేమం కోసం తక్షణమే

# నూతన సమగ్ర కౌలు చట్టాన్ని తీసుకురావాలి

- పి.జమలయ్య డిమాండ్.

అమరావతి (ప్రశ్న న్యూస్ )రాష్ట్రవ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పుల నేపథ్యంలో కౌలురైతులు గణనీయమైన సంఖ్యలో పంటలు పండిస్తున్నారని, వీరిలో ఎటువంటి భూమి లేని పేద కౌలురైతులే ఎనిమిది లక్షల మంది దాకా జీవనోపాధి పొందుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది కౌలురైతులు ఉన్నారని వీరి రక్షణ, సంక్షేమం కోసం సమగ్రమైన కౌలు చట్టం వెంటనే తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పంటల్లోనూ,అన్ని ప్రాంతాల్లోనూ కౌలు వ్యవసాయం రోజురోజుకు విస్తరిస్తుందని, రాష్ట్రంలో వ్యవసాయం అంటే కౌలు వ్యవసాయమేనని స్పష్టం అవుతుంది కానీ వ్యవసాయ, ఉద్యాన, బ్యాంకులు అమలు చేస్తున్న ఏ పథకాలు కూడా కౌలు రైతులకు అందక పోవడం భాదాకరమన్నారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు పొందాలంటే కౌలుగుర్తింపు కార్డు కచ్చితంగా అవసరమని, గ్రామ సభలు నిర్వహించి, భూ యజమాని ప్రమేయం లేకుండానే వాస్తవ సాగుదాలను గుర్తించి నేరుగానే కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు యన్ .టి .ఆర్ జిల్లా విజయవాడలోని కలెక్టర్ సమక్షంలో జరిగే స్పందన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు,యన్ టి ఆర్ జిల్లా కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్, ఉపాధ్యక్షులు పెయ్యల వెంకటేశ్వరరావు, జిల్లా రైతుసంఘం నాయకులు చెరుకూరి సుబ్బారావు, బుడ్డి వెంకటరావు తదితరలతో కూడిన ప్రతినిధి బృందం ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.జమలయ్య మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ముకునే వెసులుబాటు లేక వ్యాపారస్తులకు, దళారులకు తక్కువ ధరలకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని ఉన్నతాధికారులకు విన్నవించారు.మీ ద్వారా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం పంపించి తక్షణమే కౌలుచట్టం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.రైతుల ఆత్మహత్యల్లో కౌలురైతులే 90 శాతం మంది ఉన్నారని, కౌలు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన కనీసం భాదిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా కూడా అందని పరిస్థితి ఏర్పడిందన్నారు.ఎన్నికల సందర్భంగా నూతన కౌలుచట్టం తీసుకువచ్చి సులభంగా కౌలు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని, డబల్ ఫైనాన్స్ తో సంబంధం లేకుండా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఎటువంటి హామీలు లేని పంట రుణాలు ఇస్తామని, అన్నదాత సుఖీభవ పథకం లాంటి నగదు బదిలీ పథకాలను అమలు చేస్తామని చెప్పారన్నారు. ఖరీఫ్,రబీ పూర్తయినా ఇంతవరకు ప్రభుత్వం చట్టం తీసుకురాక పోవడం శోచనీయమన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవటం చేత ఇ-క్రాప్ బుకింగ్ లో కౌలురైతులను నమోదు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ పంటలు అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడంతో తక్కువ ధరలకు అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు మాట్లాడుతూ కౌలురైతులు పండిస్తున్న అన్ని పంటలకు ఉచిత భీమా పథకాన్ని వర్తింపజేసి ప్రీమియం మొత్తాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే



చెల్లించాలన్నారు. ప్రకృతి విపత్తులు, చీడపీడల సంభవించి పంటలు దెబ్బతిన్నపుడు భీమా పరిహారాలు, ఇన్ పుట్స్ సబ్సిడీలు అందించాలని కోరారు.గుర్తింపు కార్డు లేని వారికి కౌలు మిత్ర గ్రూపులు ఏర్పాటు చేసి వడ్డీరాయితీ పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.యన్ టి ఆర్ జిల్లా కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి మేకల్ డేవిడ్, ఉపాధ్యక్షులు పెయ్యల వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ దేవాదాయ, ధర్మాదాయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ వ్యవసాయ, ఉద్యానవను పథకాలను, బ్యాంకులు ఇచ్చే పంట రుణాలను అందించాలంటే కౌలుచట్టం తక్షణ అవసరమన్నారు. ఫార్మర్ రిజిస్టర్ లో కౌలురైతుల పేర్లు కూడా నమోదు చేసి వారికి కూడా విశిష్టగుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు చెరుకూరి సుబ్బారావు, బుడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీదారులకు ఉచిత భోజనం

**ఒంగోలు** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను నడుపుతోంది. కేవలం 5కే భోజనాన్ని అందిస్తోంది.. అదే స్ఫూర్తితో ఓ జిల్లా కలెక్టర్ సరికొత్త ఆలోచన చేశారు. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు.. ఓ చిన్న ఆలోచన వందలమంది ఆకలి తీరుస్తోంది.ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తారు.. జిల్లా నలుమూలల నుంచి అర్జీలు సమర్పించేందుకు ప్రజలు తరలివస్తున్నారు. అక్కడికి వచ్చేవారిలో కూడా పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు ఉంటారు. జిల్లాలోని మండలాల్లోని గ్రామాల నుంచి ప్రతి సోమవారం 500 మందికి వరకు కలెక్టరేట్‌కు తరలివస్తుంటారు. అక్కడ గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి వినతిపత్రాలు సమర్పించడానికి కొంత సమయం పడుతుంది. వీరిలో చాలా మంది ఆర్థిక సమస్యతో హోటళ్లకు వెళ్లి భోజనం చేయకుండా పస్తులుండే పరిస్థితులు ఉన్నాయి.ఇలా సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల కోసం సుభోజనం సహకారంతో ఉచిత భోజన వసతి అందిస్తున్నారు.

## ముంతాజ్ హోటల్‌కు వ్యతిరేకంగా స్వాముల అందోళన

**తిరుపతి** తిరుపతిలో ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన ముంతాజ్ హోటల్స్ నిర్మాణానికి వ్యతిరేకంగా స్వామిజీలు ఆందోళన చేపట్టారు. భూ కేటాయింపులు రద్దు చేయాలని, ఇప్పటివరకు నిర్మించిన భాగాలను కూల్చివేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలిపిరిలో దీక్ష ప్రారంభించిన స్వామిజీలు పాదయాత్రగా తిరుమలకు వెళ్లనున్నారు.

## టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం

**సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా రాచన్నపేట్ కాలనీలోని సాయి కృప కట్టెల మిషన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పక్కనున్న నివాస గృహాలకు ప్రమాదం తప్పింది.దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయారు.

## తెలుగు వర్శిటికి సురవరం..

- చర్లపల్లికి పొట్టి శ్రీరాములు - నేచర్ క్యూర్ కు రోశయ్య పేర్లు

**హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభలో నేడు 5 కీలక బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఎస్సీ వర్గీకరణ బిల్లు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం, దేవాదాయ చట్ట సవరణ బిల్లులను తెలంగాణ అసెంబ్లీ లో ప్రవేశపెట్టారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఎస్సీ వర్గీకరణ బిల్లును, మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ రిజర్వేషన్ల బిల్లును, మంత్రి కొండా సురేఖ దేవాదాయ చట్టసవరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. తెలుగు యూనివర్సిటీకి పొట్టిశ్రీరాములు పేరు తొలగించి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. ఆ బిల్లులపై కీలకంగా చర్చ జరుగుతోందిపొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువ చేయడం లేదు, ఆయన ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు బిల్లుపై అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గతంలో సూచించారు. ఆయన ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం పరిశీలించి బిల్లు రూపంలో సభ ముందుకు తీసుకొచ్చింది.పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నాం. రాష్ట్ర పునర్విభజన తరువాత గత 10 ఏళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని వర్గాలకు కొందరు నేతలు కొన్ని సామాజిక వర్గాల్లో అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర మంత్రి పదవుల్లో ఉన్నవారు ఇలా చేయడం సబబు కాదు. రాజకీయాలు, నాయకుల ఆలోచనలు ఎంత కలుషితం అయ్యాయో తెలియడం లేదు. గతంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నాం. అంటే ఇది దివంగత సీఎం ఎన్టీఆర్ ను అగౌరవపరిచడం కాదు. పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువ చేయడం లేదన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఆయన ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గతంలో సూచించారు. ఆయన ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం పరిశీలించిందన్నారు. బిల్లు రూపంలో సభ ముందుకు తీసుకొచ్చిందని గుర్తు చేశారు.వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టుకున్నట్లు తెలిపారు. ఏపీలో ఆ పాత పేర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలకు తెలంగాణలో పేర్లు మార్చామన్నారు.ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలుంటే పరిపాలనలో గందరగోళం తలెత్తే అవకాశం ఉందన్నారు సీఎం. అందుకే యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ పేర్లు పెట్టుకుంటున్నట్లు వివరించారు. అంతే కానీ వ్యక్తులను అగౌరవపరిచేందుకు కాదన్నారు. విశాల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు బాధ్యతాయుత పదవుల్లో ఉన్నవారు కులాన్ని ఆపాదిస్తున్నారని అన్నారు.కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటే ముమ్మాటికీ తప్పు అని అన్నారు ముఖ్యమంత్రి. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టుకుందామని, చిత్తశుద్ధి ఉంటే కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అనుమతులు తీసుకురావాలన్నారు. బల్కంపేట నేచర్ క్యూర్ హాస్పిటల్‌కు దివంగత రోశయ్య పేరు పెట్టుకుందామని, ఆయన సేవలను కీర్తించుకునేలా అక్కడ విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామన్నారు.ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి మనం తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుగాంచిన ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నాం. వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాం. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి దివంగత ప్రధాని పీవీ నరసింహారావు పేరును పెట్టుకున్నాం. ఇందులో భాగంగానే తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును మార్చుతూ సురవరం ప్రతాప రెడ్డి పేరు పెట్టుకుంటున్నాం. ఏపీలో ఉమ్మడి రాష్ట్రంలోని పాత పేర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలకు తెలంగాణలో కొత్తగా పేర్లు మార్చుకున్నాం. ఒకే పేరుతో రెండు రాష్ట్రాల్లో రెండు యూనివర్సిటీలు ఉంటే పరిపాలనాపరంగా గందరగోళం నెలకొంటుంది. కనుక తెలంగాణలోని యూనివర్సిటీలకు, సంస్థలకు స్థానిక నేతల పేర్లు పెట్టుకుంటున్నాం. అంటే గతంలో ఉన్న పేర్లను మార్చడం, మహనీయులను అగౌరవపరచడం ఏమాత్రం కాదు. పాలనా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు కొందరు కులాన్ని ఆపాదిస్తున్నారు.

## ఇసుకమల్ల శీను పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



కాప్రా (ప్రశ్న న్యూస్) శివ సాయి నగర్ కాలనీ అక్రమ అధ్యక్షుడు ఇసుక మల్ల శ్రీనివాసును త్వరలో అరెస్టు చేసే అవకాశం. శివ సాయి నగర్ కాలనీ అధ్యక్షునిగా పేరు చెప్పుకుంటూ కాలనీలో ఎవరు ఇల్లు కట్టిన వాళ్లను బెదిరిస్తూ ఐదు నుంచి 20వేల వరకు వసూలు చేస్తూ డబ్బులు ఇవ్వని మరి ఇళ్ళను కొల్చివేయిస్తూ వసూల్ రాజాగా పేరొందిన ఆర్టీసీ కాలనీ, శివ సాయి నగర్ కాలనీ అధ్యక్షుడిగా అక్రమంగా కొనసాగుతున్న ఇసుక మల్ల శ్రీనివాస్ ఆగడాలను భరించలేక అక్రమ ప్రచారాలు చేస్తూ సోషల్ మీడియాలో అక్రమ పోస్టులను పెడుతూ అక్రమార్కునిగా పేరొందిన ఇసుకమల్ల శీను పై మనోజ్ ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షులు తెలంగాణ ఉద్యమ నేత ,ఆసుపత్రి నిర్వాహకులు శివరాజ్ తో పాటు ఆర్టీసీ కాలనీకి చెందిన సోమ రాకేష్ లు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు జవహర్ నగర్ పోలీసులు ఇసుకమల్ల శీను ఆగడాలపై కేసు జీడి ఎంట్రీ చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎఫ్ఐఆర్ లో పేరు లేనటువంటి సంబంధంలేని ఓ పెద్దమనిషి శివరాజు పై అరెస్టు అనే అబద్ధపు వార్తలు రాయించినందుకు చర్యలు తీసుకోవాలంటూ మానసికంగా శారీరకంగా అవమానించిన ఇసుకమల్ల శీను దుండగపు చర్యలపై వారు తీవ్రంగా ఖండించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుని అంటూ ఎవరు ఇల్లు కట్టుకున్న ఎన్నికల సమయంలో ప్రతినిధుల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తూ పబ్బం గడుపుతున్నారంటూ ఫిర్యాదుల పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలో గల ఆలయంలో అక్రమంగా డబ్బులు దండుకోవాలన్న నెపంతో గుడికి చైర్మన్ లేకపోతే మీపై కేసులు పెడతానంటూ గుడిని అభివృద్ధి చేస్తున్న వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నాడు ఇలాంటి వ్యక్తిని ప్రజాప్రతినిధులు సైతం దగ్గరకు రానివ్వకుండా వారి ఆగడాలను ఆపే విధంగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని వారి విజ్ఞప్తి చేశారు. గుడికి సంబంధించిన కేసులో ఎటువంటి పేరు లేనటువంటి సంబంధం లేనటువంటి శివరాజును అరెస్టు చేశారంటూ పత్రికల్లో అబద్ధపు వార్తలు ప్రచురించి చార్జీట్లో పేరు ఉన్నదంటూ ఆరోపణలు చేసి చేయడంతో పాటు సోషల్ మీడియాలో అక్రమంగా పోస్ట్ చేసిన ఇసుకమల్ల శ్రీనివాస్ తో పాటు అతని వెనుక ఉండి చక్రం తిప్పుతున్న వారిపై సైతం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల పేర్కొన్నారు. పలు కాలనీలో తాగుడు కోసం బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తూ పబ్బం గడుపుతున్న ఈ గ్రూపును వెంటనే అరెస్టు చేయాలని కోరారు.

## మహిళా మంత్రిగా మహిళలకు అన్యాయం చేయడం తగదు

- కాంగ్రెస్ అంటే మహిళలని మోసం చేయడమే

- బీజేపీ నాయకురాలు ఎం. రాజేశ్వరి




**తార్నాక (ప్రశ్న న్యూస్)** వరంగల్ లో జరిగిన బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడిన మాటలు అన్ని తప్పుల తడక అని కాంగ్రెస్ అంటే మహిళాభివృద్ధి కాదని మహిళలను మోసం చేయడమే కాంగ్రెస్ విధానం అని బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి విమర్శించారు. ముఖ్యమంత్రి చెప్పిందే చేస్తాడని చేసేదే చెప్తాడని మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఏద్దేవాచేశారు. ఎన్నికలకు ముందు మహాలక్ష్మి పేరిట తెలంగాణా రాష్టంలోని మహిళలకు కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీ, పద్దెనిమిది ఏళ్ళు పైబడిన మహిళలకు ఎంతమందికి 2,500/- చొప్పున ఇచ్చారో 500/-రూపాయలకే ఎంతమందికి సిలిండర్ ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వందేళ్ల తర్వాత కులగణన చేశామని అది తమ గొప్ప అని చెప్పిన మంత్రి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అరవై ఏండ్లు ఏకచత్రాధిపత్యంగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కులగణన చేయలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట నాలుగు లక్షల యాభై వేల ఇల్లు మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప ఏఒక్క లబ్ధిదారునికి బిల్లులు ఇచినట్టు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.ఎన్నికల సందర్భంలో మహిళా సంఘాలకు ఇచ్చిన అయిదు లక్షలు రుణమాఫీ చేసి వడ్డీలేని ఋణం పది లక్షలు ఇస్తామని మహిళా సంఘాలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. బీజేపీ పార్టీ ఎప్పుడు కుల,మత రాజకీయాలు చేయలేదని కుల, మత రాజకీయాలు చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని అందుకే దసరా పండుగకి తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి చీరల పంపిణి నిలిపివేసిందని కానీ క్రిస్మస్, రంజాన్ పండుగలకు క్రిస్టియన్లకు ముస్లింలకు మాత్రం గిఫ్టులు ఇచ్చిందన్నారు. మహిళా సంఘాలకు ఏడు బస్సులిచ్చి ఎడాపెడా ప్రచారం చేసుకుంటుందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి తెలంగాణా ప్రజలు మాచేతిలో మోసపోవాలని కోరుకుంటున్నారని చేసిన వ్యాఖ్యలే ముఖ్యమంత్రి చెప్పిందే చేస్తాడు అన్న మాటలకు నిదర్శనం అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అయిన రేవంత్ రెడ్డిని ప్రశ్నించాల్సింది పోయి ఏమి చేయకున్నా అన్ని చేసినట్లు పొగడడం మహిళా సమాజానికి సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ త్యాగాల పార్టీ కాదని వాళ్ళ భోగాల కోసం వాళ్ల స్వార్థం కోసం దేశాన్ని బలి చేసి మూడు ముక్కలు చేసిందన్నారు. వారు చేసిన పాపం వల్లనే భారతదేశం ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటుందని వాటిని అధిగమించటానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

# ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం



మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ )మేడ్చల్ పట్టణంలోని కిష్టాపూర్ రోడ్ లో గల మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మాలపల్లి నర్సింహులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రేగు రాజు, దుర్గం శివశంకర్, మాజీ కౌన్సిలర్లు కౌడె మహేష్, చాప రాజు, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, జాకట దేవా, బత్తుల శివ కుమార్, తుంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్పేట్ కట్ట మైసమ్మ దేవాలయం చైర్మన్ మహేందర్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్ రెడ్డి, దుర్గం వెంకటేష్, నడికోపు రంజిత్, మేడ్చల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్, వేముల రంజిత్ రెడ్డి సీనియర్ నాయకులు అనుబంధ సంస్థల అధ్యక్షులు, ఆలయ కమిటీ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.

# రావక్కల్ కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేయండి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రావల్ కోల్ కేంద్రంగా నూతన మున్సిపాలిటిని ఏర్పాటు చెయ్యాలని ప్రజావాణిలో కలెక్టర్ కి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ. అశోక్ మరియు సిపిఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి ఎమ్. నరేష్ మాట్లాడుతూ మేడ్చల్ మండలంలో గల గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చే అవకాశం ఉన్నందునా ఇట్టి గ్రామాలన్నింటికి మధ్యలో ఉన్న రావల్ కోల్ గ్రామాన్ని మున్సిపాలిటీ కేంద్రంగా ఏర్పాటు చెయ్యాలని రావల్ కోల్ గ్రామానికి అనుబందంగా గిరిజన తాండలు ఉన్నాయని. ప్రక్కనే ఉన్న పంచాయతీలు కూడా కొద్ది దూరంలోనే ఉన్నందున, ఘనపూర్, రాజబొల్లారం, రాజబొల్లారం తాండ, లేతమామిడి తాండ, సైదోనిగడ్డ తాండ, సోమారం, ఏలంపేట గ్రామాలకు మరియు గిరిజన తండాలు కసంబై తాండ, గూడెంగడ్డ తాండ, దొంగలగుట్ట తాండలకు కేంద్రంగా ఉన్నాది కాబట్టి రావల్ కోల్ గ్రామాన్ని మున్సిపల్ కేంద్రంగా ఏర్పాటు చెయ్యాలని కోరారు. అంతే కాకుండా భవిష్యత్తులో ప్రభుత్వ భవనాలు నిర్మించుకోవడానికి రావల్ కోల్ గ్రామ పంచాయతీ పరిదియందు ప్రభుత్వ స్థలం కూడా ఉన్నందున జనాభా విషయములో కూడా రావల్ కోల్ పెద్ద గ్రామము కావున మున్సిపాలిటీ కావడానికి అన్నిరకాల అవకాశాలు ఉన్నాయని, రావల్ కోల్ గ్రామాన్ని మున్సిపాలిటీ కేంద్రంగా ఏర్పాటు చెయ్యాలని సూచించారు. కావున రావల్ కోల్ గ్రామాన్ని నూతనంగా ఏర్పాటు చేయాబోయే మున్సిపాలిటీ కేంద్రంగా ఏర్పాటు చేయాగలరని కోరూతు ఈ కార్యక్రమంలో పాల్గొన్నావారు. అశోక్ సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎమ్. నరేష్ సిపిఎం మేడ్చల్ మండల కార్యదర్శి, ఎ. కొమురయ్య. సిపిఎం రావల్ కోల్ గ్రామ కార్యదర్శి, మరియు సిపిఎం నాయకులు కిష్టప్ప, ఆధ్విక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# పది పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ శ్యాంప్రసాద్



పార్వతీపురం (ప్రశ్న న్యూస్ )పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించి సజావుగా, పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఆర్ సి ఎం. సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కేంద్రంలో పది పరీక్షల నిర్వహణ ను నిశితంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద గాలి, వెలుతురు, తాగునీరు వంటి మాలిక సదుపాయాలను ఉన్నవి, లేనిది చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీ చేయకుండా ఇన్విజలెటర్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేసవి ఉష్ణోగ్రత స్థాయి అధికంగా ఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సిబ్బందితో పాటు ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను ముందస్తుగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద భద్రత పరంగా 144 సెక్షన్ అమలు, తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు నిర్దేశిత సమయంలోగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.మార్చి 17 నుంచి 31 లేదా ఏప్రిల్ 1వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.45 గం.ల వరకు జరుగుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,455 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్న నేపథ్యంలో ప్రతి పరీక్షా కేంద్రంలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైల్వే గేట్లు గల గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగా బయలు దేరేటట్లు చూడాలని ఆయన అన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించామన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు ఉంటుందని తెలిపారు. జిల్లాలో 220 పాఠశాలలకు చెందిన 10,455 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 10,367 మంది విద్యార్థులు రెగ్యులర్ కాగా, 88 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరుకానున్నారని అన్నారు. జిల్లా లోని 67 పరీక్షా కేంద్రాలకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది శాఖాధికారులు, 3 ఫ్లయింగ్ స్కాడ్ లను నియమించినట్లు తెలిపారు.ఓపెన్ పదవ తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 09.30 గం.ల నుంచి 12.30 గం.ల వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు 560 మంది విద్యార్థులు హాజరు అవుతున్నట్లు ఆయన చెప్పారు. పార్వతీపురం లో 2 కేంద్రాలు, పాలకొండలో 6 కేంద్రాల్లో జరుగుతున్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

# ఏఐవైఎంటిఎస్ కార్యదర్శిగా : చిన్నాల శ్వేత యాదవ్

- యాదవ్ మహిళలోకాన్ని చైతన్యవంతులను చేస్తా చిన్నాల
- సామాజికంగా,ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతాం





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు చిన్నాల శ్వేత యాదవ్.ఈ సందర్భంగా ఆమె సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోయిన్ పల్లి ప్రాంతంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.చిన్నాల మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో మహిళాలు కూడా కీలక భూమిక పోషించారు.ఆ మహిళా రత్నలే మాకు ఆదర్శం అని
సమాజం,సామాజికంలో గుర్తుండిపోయేలా సాహసోపేతమైన నిర్ణయాలతో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు శ్వేత యాదవ్ పేర్కొన్నారు.యాదవ్ సామాజికంలో కొంతమంది ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన విషయం విదితమే.అందుకే ముఖ్యంగా మహిళలను జాగృతి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు శ్వేత తెలిపారు. అఖిలభారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బోయిన్ పల్లికి చెందిన చిన్నాల శ్వేతా యాదవ్ ఎన్నికయ్యారు. అఖిలభారత యాదవ మహాసభలో కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందని ఆమె ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ వ్యాప్తంగా అఖిల భారత యాదవ మహాసభ మహిళా విభాగాన్ని బలోపేతం చేయడమే తన లక్ష్యం ముందుంది అన్నారు.తాను వృత్తి పరంగా వైద్యురాలిగా విధులు నిర్వహిస్తూనే తెలంగాణ వ్యాప్తంగా వెనుకబడిన యాదవ మహిళలలో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. అలాగే తెలంగాణలోని వివిధ జిల్లాలలో యాదవ మహిళలు వెనుకబడి ఉన్నారని వారిని విద్య,ఆర్థిక,రాజకీయ రంగాలలో ఉన్నత స్థాయికి తీసుకురావడంలో తన వంతు కృషి చేశానని అన్నారు.ముఖ్యంగా పెద నిరుపేద కుటుంబంలో సరస్వతి కుసుమాలను వెతికి వారిని అన్ని విధాలుగా ఆదుకొని ఈ సమాజంలో ఉన్నత శిఖరాల్లో ఉంచుతామని చెప్పారు. తెలంగాణలోని గ్రామీణ మారుమూల ప్రాంతాలలో యాదవ మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తమ సామాజిక వర్గంలో వెనుకబాటుకు గురైన మహిళలను గుర్తించి చైతన్య పరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్,జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్,రాష్ట్ర యాదవ మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు,చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు.

# రాజన్న పుణ్యక్షేత్రంలో అంగరంగ వైభవంగా "శివ కళ్యాణం వేడుకలు"

- కన్యాదాతలుగా ఈశ్వరగారి సురేష్-నాగలక్ష్మీ దంపతులు
- స్వామివారి దివ్య కళ్యాణ వేడుకలు వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చిన శివ పార్వతులు... భక్తులు
- వేములవాడ పట్టణమంతా శివనామ స్మరణతో మోత
- పట్టణ పుర వీధులన్నీ ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న వేళా
- ప్రత్యేక ఆకర్షణగా శివ పార్వతుల పరస్పర కళ్యాణ తంతూ







వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోనే దక్షిణ కాశీగా పేరు గాంచిన ల్,ప్రముఖ శైవక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామివార్ల దివ్య కళ్యాణం అత్యంత అంగరంగా వైభవంగా ల్,కన్నుల పండువగా జరిగింది.వరుడు శ్రీ రాజరాజేశ్వర స్వామి,వధువు పార్వతి దేవి అమ్మవారిని మేళ తాళాలతో చైర్మన్ చాంబర్ ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కళ్యాణ వేదిక వద్ద వరకు ఎదుర్కొన్నారు.వరుని తరుపున ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, వధువు తరుపున అర్చకులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించగా,వరకట్నంగా రూ. 551 కోట్లు చెల్లిస్తామన్నారు. కన్యాదాతలుగా ఈశ్వరగారి సురేష్-నాగలక్ష్మి దంపతులు వ్యవహరించారు. అంతకుముందు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నమిలకొండ ఉమేష్ శర్మ అధ్వర్యంలో అభిజిత్ లగ్న మూహుర్తమున ఉదయం 10 .55 నిమిషాల నుండి 12.05 నిమిషాల వరకు వేద మంత్రోచ్చారణలతో శ్రీ స్వామి వారి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మరో వైపు శ్రీ స్వామి వారి కళ్యాణం జరుగుతుండగా శివ పార్వతులు ఒకరిపై ఒకరు పరస్పరం తలంబ్రాలు పోసుకొని,శివుడిని పెళ్లాడినట్లు స్మరించుకున్నారు. శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వార్ల దివ్య కళ్యాణ మహెూత్సవానికి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తరుపున ఆలయ కార్యనిర్వహణాధికారి వినోద్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ అన్వేష్,అధికారులు మున్సిపల్ కార్యాలయం నుండి మేళతాళాల మధ్య ఆలయానికి చేరుకొని స్వామి వారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు.శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ల దివ్య కళ్యాణ వేడుకలను తిలకించడానికి తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి వేలాది గా శివపార్వతులు,భక్తులు తరలివచ్చారు.ఈ నేపథ్యంలో రాజన్న ఆలయంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో క్రిక్కిరిసి పోయి,పుర వీధులన్నీ శివనామ స్మరణతో మారు మోగాయి.దాదాపు 2 గంటల పాటు జరిగిన కళ్యాణాన్ని భక్తులు అసక్తిగా తిలకించారు.ప్రధానంగా కళ్యాణం జరిగేటప్పుడు శివ పార్వతులు చేతి లో త్రిశూలాలను కదిలిస్తూ, ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకొని తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు.శివ కళ్యాణాన్ని పురస్కరించుకొని సోమవారం వేములవాడ పట్టణమంతా శివనామ స్మరణతో,ఆధ్యాత్మిక శోభను సంతరించుకొంది. సోమవారం స్వామివారి దివ్య శివ కళ్యాణ వేడుకల సందర్భంగా ఆలయ అధికారులు, స్థానిక మున్సిపల్ శాఖ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

# నగరం లో అన్నా క్యాంటీన్లను సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళ మాధవి, కమిషనర్



గుంటూరు (ప్రశ్న న్యూస్ )అన్న క్యాంటీన్లలో ఆహారం తీసుకుంటున్న ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తూ, రూ.5తో ఆకలి తీరుస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మిర్చి యార్డ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని పశ్చిమ నియోజకవర్గ యం ఎల్ ఎ గల్లా మాధవి తో కలిసి పరిశీలించి, టిఫిన్ చేసి, ప్రజలతో మాట్లాడి, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన, రుచికరమైన ఆహారం పేదలకు అందుతుందన్నారు. ప్రధానంగా మిర్చి యార్డ్ దగ్గరలోని క్యాంటీన్ లో పూటకు 5 వందల మందికి పైగా ఆహారం తీసుకుంటున్నారన్నారు. ప్రజలు కూడా ఆహార నాణ్యత, రుచిపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. క్యాంటీన్లకు వస్తున్న పేదవారికి ఎవ్వరికీ ఆహారం అందలేదని ఫిర్యాదు రాకూడదని, అందుకు తగిన విధంగా ఆహారం సరఫరా జరిగేలా అక్షయపాత్ర సిబ్బంది అందించాలన్నారు. ప్రజలు క్యాంటీన్ లో అందే ఆహారంపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియ చేయవచ్చన్నారు.

యం ఎల్ ఎ మాధవి మాట్లాడుతూ అన్నక్యాంటీన్లు పేదల ఆకలి తీర్చే అక్షయపాత్రల వలె నిలిచాయయని, ఆకలితో ఉన్నవారికి రూ.5కే ఆహారం అందించి వారికి అన్నపూర్ణలాగ రాష్ట్ర ప్రభుత్వం నిలిచేలా ముఖ్యమంత్రి అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. క్యాంటీన్లలో ఆహారంపై పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, రోజువారీ వచ్చే వారందరికీ ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# మిర్చి తోడిమెలు తీసే వ్యార్థాలు గోడౌన్ లను పరిశీలించిన : కమిషనర్



గుంటూరు (ప్రశ్న న్యూస్) నగరపాలక సంస్థ పరిధిలో మిర్చి తొడెమెలు తీసే గోడౌన్ ల వ్యర్థాల వలన ప్రజలు మిర్చికోరుతో ఇబ్బందులు పడుతున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్వహకులు తగు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం పశ్చిమ నియోజకవర్గ యం ఎల్ ఎ గల్లా మాధవి ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి చుట్టగుంట సెంటర్ నుండి మిర్చి యార్డ్ వరకు పర్యటించి, మిర్చి తొడెమెల గూడౌన్ ల్లో పరిశీలించి యాజమాన్యాలతో మాట్లాడి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు, యాజమాన్యాలకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చుట్టగుంట పరిసర ప్రాంతాల పలు కాలనీల్లో మిర్చి తొడెమెల వలన తీవ్ర కోరుతో ఇబ్బందులు పడుతున్నట్లు, అనారోగ్య సమస్యలు వస్తున్నట్లు ప్రజలు అనేక ఫిర్యాదులు అందిస్తున్నారని, తొడెమెలు తీసే గూడౌన్ నిర్వహకులు తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. తొడెమెలను రోడ్ల మీద, డ్రైన్లలో వేయరాదని, అలా వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు తొడెమెలను దహనం చేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి, భారీ అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. కొత్తకాలనీ మెయిన్ రోడ్ పై ఏర్పడిన పైప్ లైన్ లీకును మరమత్తు చేయాలని, ఎమినిటి కార్యదర్శులు ఎప్పటికప్పుడు సచివాలయం పరిధిలో లీకులను గుర్తించడం, మరమత్తులు చేయించాలని ఆదేశించారు.

యం ఎల్ ఎ మాధవి మాట్లాడుతూ మిర్చి తొడెమెలు తీసే గూడౌన్లలో ఎక్కువ మంది మహిళా కార్మికులు పని చేస్తున్నారని, యాజమాన్యాలు వారికి త్రాగునీరు, టాయ్ లెట్స్ వంటి మౌలిక వసతులను కల్పించాలన్నారు. తొడెమెలను గుట్టలుగా మెయిన్ రోడ్ల పక్కన వేయడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని గూడౌన్ లోపలే స్టోర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో సిటి ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డిఈఈలు శ్రీనివాస్, మధుసూదన్, కార్పొరేటర్ అడకా పద్మావతి, ఏఈలు, టిపిఎస్ లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బయటపడ్డ సీక్రెట్..



## పుష్ప2 అంతా అల్లు అర్జున్ పాన్ తినడం వెనక కారణం ఇదా?

అల్లు అర్జున్-సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన క్రేజీ ప్రాజెక్ట్ పుష్ప. ఈ చిత్రం ఎంత సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాతో బన్నీకి నేషనల్ అవార్డ్ కూడా దక్కింది. ఇక పుష్ప సినిమాకి సీక్వెల్‌గా పుష్ప2 అనే చిత్రాన్ని తెరకెక్కించారు. గతేడాది డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం మొదటి షోతోనే బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. ఏకంగా రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి భారతీయ బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టింది. ఈ బ్లాక్ బస్టర్ మూవీ విడుదలై 100 రోజులు పూర్తి కావడంతో మేకర్స్ ప్రత్యేకంగా ఒక వీడియోని విడుదల చేశారు. 'ఇండియన్ సినిమా ఇండస్ట్రీ పుష్ప 2 ది రూల్.. 100 డేస్. బాక్సాఫీస్ రికార్డ్ లు బద్దలు కొడుతూ.. భారతీయ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది అంటూ ట్విటర్‌లో సుమారు 38 సెకెన్ల నిడివి ఉన్న వీడియో విడుదల చేశారు. ఈ వీడియోలో అల్లు అర్జున్ డైలాగ్స్‌లో కొన్నింటిని యాడ్ చేశారు. అయితే ఈ సినిమాకి సంబంధించిన సీక్రెట్ ఒకటి ఇప్పుడు బయటకు వచ్చింది. సినిమా అంతా అల్లు అర్జున్ గుట్కా నములుతూ ఉండడం మనం చూశాం. గుట్కా నోట్లో ఉండటంతో మాట్లాడటం కూడా కాస్త డిఫరెంట్ గా మాట్లాడాడు. దమ్ముంటే పట్టుకోర షెకావత్ పాట కూడా అల్లు అర్జున్ నోట్లో గుట్కా పెట్టుకునే ఉన్నాడు. సినిమాలో ఎక్కడా అల్లు అర్జున్ క్లీన్ వాయిస్ లేకుండా చేయడంలో సుకుమార్ మాస్టర్ ప్లాన్ ఇప్పుడు బయటకి వచ్చింది. నార్త్‌లో ఎక్కువగా గుట్కా ఉపయోగించడం మనం చూస్తుంటాం. ఈ అలవాటుని తన సినిమాలో హీరోకి చూపిస్తే అక్కడ ఎక్కువ స్పందన వస్తుందని భావించిన సుకుమార్ బన్నీతో అలా చేయించాడట. అంతేకాదు బన్నీ గెటప్ లో కూడా కాస్త నార్త్ టచ్ చేసి ఆయన డ్రెస్సింగ్‌లో కూడా అది కనిపించేలా చేశాడు. మొత్తానికి సుకుమార్ చేసిన ప్లాన్ సూపర్ సక్సెస్ కావడం, సినిమాకి భారీగా రెస్పాన్స్ రావడం జరిగింది. ఇక సుకుమార్ తెరెక్కించిన 'పుష్ప 2' చిత్రం లో రష్మిక మందన్న హీరోయిన్ గా నటించింది. ఫహద్ ఫాసిల్, సునీల్, రావు రమేష్, డాలీ ధనంజయ్, తారక్ పొన్నన్న,జగపతి బాబు తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శ్రీలీల ఓ స్పెషల్ సాంగ్ లో కనిపించి సందడి చేసింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చారు.

### అభిమానుల ఎదురు చూపులకి

# పులిస్టాప్ పడింది..

## - అఫీషియల్‌గా వార్ 2 రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్



ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఎన్టీఆర్ ఆ తర్వాత దేవర అనే సినిమా చేశాడు. ఈ సినిమా మంచి విజయం సాధించింది. ఇక వార్2 చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చాడు. ఇందులో బాలీవుడ్ టాప్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడు.ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ వస్తున్నారు. అయితే వారి ఎదురుచూపులకి మేకర్స్ పులిస్టాప్ పెట్టారు. యష్ రాజ్ ఫిల్మ్స్ పై యూనివర్స్ గురించి ఓ నెటిజన్ పోస్ట్ పెడుతూ 'వార్ 2' మూవీ గురించి ప్రస్తావించాడు. దీనిపై సదరు నిర్మాణ సంస్థ స్పందిస్తూ గుడ్ న్యూస్ చెప్పింది మేము వార్ 2 మార్కెటింగ్ ప్రారంభించక ముందే అద్భుతంగా సెటప్ చేశారు. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది ఆగస్ట్ 14న థియేటర్లలో అల్లకల్లోలం సృష్టిస్తుంది అంటూ పోస్ట్‌లో రాసుకొచ్చారు. దీంతో అభిమానుల ఆనందం హద్దులు దాటింది. ఇద్దరు పవర్ ఫుల్ హీరోస్ తెరపై జంటగా కనిపిస్తే ఆ సందడి పీక్స్‌లో ఉంటుంది.

హృతిక్, ఎన్టీఆర్ పర్‌ఫార్మెన్స్ చూడడానికి రెండు కళ్లు సరిపోవు అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇండిపెండెన్స్ డే స్పెషల్‌గా ఆగస్టు 14న రిలీజ్ చేస్తారని ఎప్పటి నుంచో ప్రచారం సాగుతోంది. అయితే, ఇటీవల హృతిక్ రోషన్‌కు గాయం కావడంతో షూటింగ్‌కు బ్రేక్ పడిందని.. అనుకున్న టైంకు మూవీ రిలీజ్ కాదేమో అనే అనుమానాలు నెలకొనగా, ఎట్టకేలకి క్లారిటీ వచ్చేసింది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన స్పై థ్రిల్లర్ మూవీ 'వార్ కాగా, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా వార్ 2 వస్తోంది. ఈ సినిమాలో ఎన్టీఆర్, హృతిక్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా కనిపించనున్నట్లు సమాచారం. అయితే, ఏజెంట్ పాత్రలన్నింటి కంటే డిఫరెంట్‌గా ఈ మూవీలో ఎన్టీఆర్ పాత్ర ఉండనున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఈ మూవీతోనే ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్నట్టు తెలుస్తుంది. ఇక ఈ మూవీ తర్వాత ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ చిత్రం షూటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

# ఛావా సరికొత్త రికార్డ్..

### ఏకంగా పుష్ప2, బాహుబలి

## 2 రికార్డ్స్‌ని బ్రేక్ చేసిందిగా..!

ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీని ముద్దుగా ఛావా అని పిలిచేవారు. ఛావా అంటే సింహం పిల్ల అని అర్థం కాగా, శివాజీ సింహం అయితే.. ఆయన కుమారుడు సింహం పిల్ల 'ఛావా' అని పేరు. అయితే ఛావా ఒక పేరు కాదు, ఒక ఎమోషన్. ఛావా పేరుతో బాలీవుడ్‌లో తెరకెక్కిన ఈ సినిమా బాలీవుడ్‌లో రికార్డులు చెరిపేస్తుంది.

చారిత్రక చిత్రాల్లో సరికొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేసింది. హిందీలో విడుదలైన మూడు వారాల తర్వాత తెలుగులో విడుదలైన తర్వాత కూడా ఈ మూవీకి జనాలు నీరాజనాలు పలుకుతున్నారు. వీక్ డేస్ లో నెమ్మదించినప్పటికీ వారాంతం వస్తే చాలు ఈ మూవీకి జనాలు క్యూ కడుతున్నారు. ఆలస్యంగా రిలీజైనప్పటికీ ఛావా తెలుగు వెర్షన్ పదిహేను కోట్లను దాటేసింది. ఒకవేళ కోర్ట్ కనక దూకుడుగా లేకపోయి ఉంటే ఛావా సినిమా పాతిక కోట్లు సులువుగా లాగించేది.ఇప్పటి వరకు ఈ చిత్రం 700 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టగా, ఐదో వీకెండ్‌లో మరో 22 కోట్లు జోడించుకుని సరికొత్త రికార్డును క్రియేట్ చేసింది. ఐదో వీకెండ్‌లో దూసుకుపోతున్న ఛావా 'పుష్ప 2' పేరిట ఉన్న రికార్డ్‌ని బ్రేక్ చేసింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప2 చిత్రం ఐదో వీకెండ్‌లో 14 కోట్ల వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే రికార్డును ఛావా దాటేసింది. బాహుబలి 2 విషయానికి వస్తే ఈ మూవీ ఐదో వీకెండ్‌లోనూ అదరగొట్టి అప్పట్లో 8.5 కోట్ల వసూళ్లు సాధించి సరికొత్త రికార్డ్ సృష్టించింది. మరోవైపు ఇదే లిస్ట్‌లో 'స్త్రీ 2' కూడా ఉంది. ఈ చిత్రం ఐదో వీకెండ్‌లో 16 కోట్ల వసూళ్లు సాధించి మంచి హిట్‌గా నిలిచింది. మొత్తంగా చూస్తే, హిందీ మార్కెట్‌లో ఐదో వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్ 5 సినిమాలలో ఛావా రూ.22 కోట్లుతో తొలి స్థానంలో ఉంది. రెండో స్థానంలో స్త్రీ 2 -16 కోట్లు మూడో స్థానంలో పుష్ప 2: ది రూల్ - 14 కోట్లు , నాలుగో స్థానంలో యూరి -12.50 కోట్లు ఐదో స్థానంలో బాహుబలి 2 - 8.5 కోట్లు నిలిచాయి.





# సెంటిమెంట్ కలిసొస్తుందా?

క్వాంటిటీ కన్నా.. క్వాలిటీకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నది మలయాళ మందారం అనుపమ పరమేశ్వరన్. దీనివల్ల సినిమాల సంఖ్య తగ్గుతున్నా.. మంచి పాత్రలు ఆమె పరమవుతున్నాయి. రీసెంట్‌గా 'రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్'లో అద్భుతమైన పాత్రలో కనిపించి యూత్‌ని ఓరేంజ్‌లో ఆకట్టుకున్నది అనుపమ. ఇదిలావుంటే.. ఇటీవలే ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఈ అందాలభామ పచ్చజెండా ఊపేసిందట. ఆ వివరాల్లోకెళ్తే.. శర్వానంద్ కథానాయకుడిగా సంపత్‌నంది ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఆ సినిమాలో కథానాయికగా అనుపమ పరమేశ్వరన్ ఎంపికైంది. ఇటీవలే అనుపమకు దర్శకుడు సంపత్‌నంది కథ కూడా వినిపించారట, తన పాత్ర బాగా నచ్చడంతో అనుపమ ఓకే చెప్పేసిందట. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ కలిసి నటించిన 'శతమానం భవతి' సినిమా ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. మళ్లీ ఇన్నాళ్లకు ఈ జంట కలిసి నటిస్తున్నారు. దీనివల్ల సినిమాపై పాజిటీవ్ వైబ్ క్రియేటవ్వడం ఖాయం.

### యాక్షన్.. రొమాన్స్ వెరసి

# కిస్ కిస్ కిస్సిక్..



సుశాంత్, జాన్య జోషి, విధి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'కిస్ కిస్ కిస్సిక్'. శివ్ హరే దర్శకుడు. గణేష్ ఆచార్య, విధి ఆచార్య నిర్మాతలు. విజయ్‌రాజ్, మురళీశర్మ, కీలక పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వివిధ భాషల్లో ఈ నెల 21న సినిమాను విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. నిర్మాత గణేశ్ ఆచార్య మాట్లాడుతూ 'ఇది బ్యూటిఫుల్ కాన్సెప్ట్. మైత్రీ బ్లాక్‌బస్టర్ 'పుష్ప2'లోని 'కిస్ కిస్ కిస్సిక్' పాట పల్లవిలోని తొలి పదం మా సినిమా టైటిల్ కావడం ఆనందంగా ఉంది. న్యూటాలెంట్‌ని ఈ సినిమా ద్వారా పరిచయం చేస్తున్నాం. యాక్షన్, రొమాన్స్ అన్నీ ఉన్న ఫ్యామిలీ ఎంటైర్టైనర్ ఇది' అని తెలిపారు. 'రషెస్ చూశాను. సినిమా చాలా లావిష్‌గా ఉంది.. మంచి ఎంటైర్టైనర్. ఇందులో తొమ్మిది పాటలున్నాయి. వాటిలో అయిదు ట్రెండింగ్‌లో ఉన్నాయి. తప్పకుండా సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది.' అని మైత్రీ అధినేత నవీన్ యెర్నేని ఆశాభావం వెలిబుచ్చారు. ఇంకా ఇందులో నటించిన సుశాంత్, జాన్య జోషి, విధి కూడా మాట్లాడారు.

# రొమాంటిక్ అబ్బాయి.. లవ్లీ అమ్మాయి



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటిస్తున్న లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటైర్టైనర్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. నితిన్, భరత్ కలిసి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ పతాకంపై రూపొందుతోన్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ప్రదీప్, దీపికా జంటను ఓ రౌడీ గ్యాంగ్ వెంబడించడం ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వెన్నెల కిశోర్, సత్య, గెటప్‌శ్రీను, మురళీధర్‌గౌడ్, జి.ఎం.సుందర్, జాన్ విజయ్, రోహిణి, ఝాన్సీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎంఎన్ బాలరెడ్డి, సంగీతం: రధన్.

## రాజన్న ఆలయం ఆధ్వర్యంలో

# భక్తులకు అన్నదానం

**- ఆలయ ఈఓ : వినోద్ రెడ్డి**





వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం వైభవోపేతంగా నిర్వహించిన శివ కళ్యాణాన్ని చూసేందుకు భక్తులు వేములవాడ రాజన్న ఆలయానికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కళ్యాణం పూర్తయిన అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ పార్కింగ్ స్థలంలో ఉచితంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించి, ఆకలి దప్పికలు తీర్చుకున్నారు.కన్నుల పండుగగా శివ కళ్యాణం జరిగిందని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు ఆలయం భక్తులతో సందడిగా మారింది.సుమారుగా 50 వేల మందికి పైగా భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేసిన్నట్లు ఈఓ వినోద్ రెడ్డి వెల్లడించారు.

## మంత్రి ఇలాకాలో

# ప్రభుత్వ అధికారులే కరువైనారు?

**- పేద ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వ యంత్రాంగమే ఖాళీ కుర్చీలతో బోసిపోతే ?**

**- సామాన్య ప్రజల కష్టాలను పట్టించుకునే నాథులే కరువైనారు**




మంథని ( ప్రశ్న న్యూస్) మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులు కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో లేని అధికారుల గురించి ఆలోచన చేయట్లేదు. అనేక ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు ప్రభుత్వ పాలన కొనసాగించకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు . రాష్ట్రంలో పేరు గొప్ప పరిపాలన దిబ్బ అనే సందర్భంలో గుడ్డిలో మెల్లగా మంథని నియోజక వర్గంలో పరిపాలన కొనసాగిస్తున్నారు ,ప్రభుత్వ అధికారులు అందలమెక్కి పేద ప్రజలను దోచుక తింటుంటే మంత్రి పూల భోకెలతోనే సరిపెట్టుకుంటూ కాలం గడుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన పేద ప్రజల కష్టాలు ఎండమావి గానే తయారైనవి. మంథని రెవెన్యూ డివిజన్ అని చెప్పుకునే పట్టణంలో పేద ప్రజలకు సేవ చేసే ప్రభుత్వ అధికారుల కార్యాలయాలలో ప్రధాన కుర్చీలు ఖాళీ స్థానంతో ఇన్చార్జీలుగానే పరిపాలన కొనసాగిస్తున్నారు .గత ప్రభుత్వం కంటే మా పరిపాలన బాగుగా ఉంటుందని పత్రికా ప్రకటనలలో, టీవీ ఛానల్ లలో ముందు వరుసలో ఉంటుంది ప్రజలకు సేవ చేస్తే ప్రజల మనసులో ఉండాలి. ఈ ప్రభుత్వం బాగుంటదని ప్రజలే కష్టాలు పడితే అధికారులే కరువైతే సేవ ఎంతవరకు చేస్తున్నారో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇలాంటి ప్రభుత్వాలను ప్రజలు ఎన్నోసార్లు చవి చూశారు ఇకనుండి అయినా ప్రజలకు సేవ చేయని ప్రభుత్వాలకు త్వరలో ప్రజలే స్వస్తి పలుకుతారు. ప్రజా క్షేత్రంలో ప్రజా సంక్షేమమే చేస్తున్నామని కోట్లకు కోట్లు దండుకుంటున్న అధికారులను గాని, రాజకీయ నాయకుల గాని పట్టించుకునే నాధుడే కరువైపోయారు. అయితే ఇక్కడ ఉన్న రాజకీయ నాయకులు. మంథని ప్రభుత్వ ఆరోగ్య దావ ఖానలో వైద్య అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి విచ్చలవిడిగా దందా లు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఆరు గ్యారంటీల అమలులో ప్రధాన పథకాలు రెండు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేసే అధికారులు ఖాళీ కుర్చీలతో ఉంటే పేద ప్రజలు కష్టాలతో సతమతమవుతుంటే ఈ మంజూరు పత్రాలు ఎవరికి ఇయ్యవలసి ఉంటుంది. ఇకనుండి అయిన మంత్రి నియోజక వర్గాన్ని మంత్రి మైక్రోస్కోప్ లో పెట్టి అధికారులను ఆఫీసులలో ఖాళీ కుర్చీలు బోసిపోకుండా చూసి ప్రజలకు చేరువయ్యి వారి బాగోగులను పట్టించుకోని అధికారులను నియమించి మంథనిని మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి బాటలో నడిపించాలని ప్రజలు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

## రాజరాజేశ్వర స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం సతీమణి మంజుల



వేములవాడ,(ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి “శివ కళ్యాణం” సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి సోమవారం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల పట్టు వస్త్రాలను సమర్పించారు.

# మా కళాశాల భూములను కాపాడండి కలెక్టర్ సార్

**- నాయుడుపేట లో కదం తొక్కిన విద్యార్థులు**

**- కళాశాల స్థలాన్ని కాపాడుకుంటాం**

**- రోడ్డెక్కిన డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు**

**- కాళహస్తి హైవే భారీ గా ర్యాలీ**

**- సంఘీభావం ప్రకటించిన ఏబీవీపీ**






నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్) నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ క్రీడా మైదానాన్ని ఆక్రమణల పర్వంనుండి కాపాడాలని విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు సోమవారం డిగ్రీ కళాశాల నుండి ర్యాలీగా బయలుదేరి నాయుడుపేట శ్రీకాళహస్తి జాతీయ రహదారి వరకు రాస్తారోకో నిర్వహించారు.క్రీడా మైదానాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. అనంతరం శ్రీ కాళహస్తి జాతీయ రహదారి పక్కన టెంట్ వేసి ఆందోళనకు దిగారు, సుమారు నాలుగు ఎకరాల 15 సెంట్లు విస్తీర్ణం గల ప్రభుత్వ భూమిని జిల్లా అధికారులే కబ్జా నుంచి కాపాడాలని విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. క్రీడా మైదానాన్ని కాపాడాలంటునినాదాలు చేశారు. పెద్ద ఇఖారీ ర్యాలీ నిర్వహించారు. కాళహస్తి హైవే ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు.ఈ సందర్భంగా వారు విద్యార్థినీ విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీలో ఆక్రమణలను అడ్డుకుంటామని, అవసరమైతే ప్రాణాలైన అర్పించి కాలేజీని కాపాడుకుంటామన్నారు. కాలేజీ, గ్రౌండ్స్ మాసొత్తు అని ఆకతాయి కాలేజీ ప్రాంగణంలోకి ప్రవేశించి మద్యం సేవించి నాన్న ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదనను అధికారులు గుర్తించి కాలేజీ ప్రాంగణంలోకి ఆక్రమణలకు గురైన స్థలాన్ని కాపాడాలని విద్యార్థిని విద్యార్థులు ప్రాధేయపడ్డారు. కాలేజీ స్థలాన్ని కాపాడాలని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున తాము మరింత ఉద్యమిస్తామన్నారు. కళాశాల స్థలాన్ని పరులపాలు కాకుండా కాపాడుకుంటామన్నారు. డిగ్రీ కాలేజీ క్రీడా మైదానం సర్వే నెంబర్ 173 లో 4.15 ఎకరాల భూమిలో సమీపంలో ఉన్న భూపయ్య కాలనీవాసులు ఆక్రమించి గుడిసెలు వేశారన్నారు. అంతేగాకుండా స్థానికులు రాత్రి సమయాల్లో మద్యం సేవించి మద్యం బాటిల్ అక్కడే వదిలేయడం వల్ల విద్యార్థులు కుగాయాలవుతున్నాయన్నారు. క్రీడల సమయంలో, కాలేజీ నిర్వహించే ఫంక్షన్లలో ప్రైవేట్ వ్యక్తులు చొరబడి గొడవలకు దిగుతున్నారని ఆరోపించారు.డిగ్రీ కాలేజీ మైదానాన్ని ఇటు కాలేజీవిద్యార్థులు, అటు అంబేద్కర్ గురుకులం విద్యార్థులు ఉమ్మడిగా వాడుకుంటున్నామన్నారు.ఎన్ ఏ ఏసి క్యాంపులు సమయంలో కాలేజి గ్రౌండ్ లోనే ఉన్నప్పటికీ ఇతరప్రాంతలలో ఉన్నట్లు అభద్రత భావం కలుగుతుందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కాలేజీ మైదానంలో ఉన్న ఆక్రమణలు తొలగించి ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు.

## ఎండ తీవ్రత దృష్ట్యా ఆర్టీసీ ఆన్ డ్యూటీ

# సిబ్బందికి మజ్జిగ పంపిణీ

**- ప్రయాణీకురాలు పోగొట్టుకున్న ల్యాప్టాప్,విలువైన వస్తువులు అప్పగింత**

**- టీజీఎస్ ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ : భూపతి రెడ్డి**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వేసవికాలంలో విధులు నిర్వహించే ఆన్ డ్యూటీ సిబ్బంది కొరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి విసి అండ్ ఎండి సజ్జనార్ ఆదేశాల మేరకు సోమవారం వేములవాడ డిపోలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆర్.ఎం) ( ఆపరేషన్) భూపతి రెడ్డి చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్ ఎం మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ నుంచి రక్షణ కొరకు తగు చర్యలు తీసుకొని సిబ్బంది మీ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తరచుగా చల్లని పానీయాలు సేవిస్తూ డ్యూటీ చేసి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్,టి ఐ టు పిఎస్ నారాయణ, డిపో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, పి ఆర్ ఓ శ్రీనివాస్ యాదవ్, బస్ స్టేషన్ కంట్రోలర్ ప్రకాష్,తదితర ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

**-ప్రయాణీకురాలికి పోగొట్టుకున్న విలువైన వస్తువులు అందజేత**

వేములవాడ డిపో బస్సు హైదరాబాద్-వేములవాడ ప్రయాణంలో తన బ్యాగులో ఉన్న ల్యాప్టాప్,ఇతర విలువైన వస్తువులను పోగొట్టుకొని ఆర్టీసీ డిపో వారిని సంప్రదించగా ఆన్ డ్యూటీ టిమ్మ్కు డ్రైవర్ సదరు ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగును జాగ్రత్తగా బస్టాండ్లో అప్పగించగా ప్రయాణికురాలికి అందజేయడం జరిగింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ ఆర్ ఎం, వేములవాడ డిపో మేనేజర్ సదరు డ్రైవర్ నిజాయితీని అభినందించారు.

## ఘనంగా పూజలందుకున్న గణనాథుడు

**- సంకటాలు తొలగించే సంకట హర చతుర్థి**



మంథని (ప్రశ్న న్యూస్) పాల్గుణ మాసం కృష్ణ పక్షం సోమవారం రోజున సంకష్ట హర చతుర్థి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. దేవతలలో ప్రథమంగా పూజలందుకునే గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. అలాంటి గణపతి ని సంకష్ట హర చతుర్థి రోజున దర్శించుకుంటే దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలన్నీ తొలగిపోతాయని శాస్త్రాల్లో చెప్పబడింది. జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికమించడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష చేపట్టడం ఎంతో శుభదాయకం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి - బుద్ధి సమేతంగా కొలువుతీరిన మహా గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని సోమవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది. చంద్రోదయం అనంతరం స్వామివారి పూజ చేసి భోజనం చేయడం చతుర్థి యొక్క ప్రత్యేకత. ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళుగాని, ఫలములు గాని నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్ష ప్రాధాన్యత. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

## అంబేద్కర్ సంఘం అదనపు

# గదుల నిర్మాణానికి భూమిపూజ

**- నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు**

**-తిప్పాపూర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు**

**- సుంకపాక శ్రీనివాస్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ, తిప్పాపూర్ లోని అంబేద్కర్ సంఘం అదనపు గదుల నిర్మాణానికి వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హెచ్.డి.ఎఫ్.సహకారంతో నిధులను మంజూరు చేయగా సోమవారం అదనపు గదుల నిర్మాణానికి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సుంకపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సంఘం సభ్యుల సమక్షంలో ఘనంగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ సంఘం అదనపు గదుల నిర్మాణానికి నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు తిప్పాపూర్ అంబేద్కర్ సంఘం పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని,మరిన్ని నిధుల మంజూరు కు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు మాజీ ఉప సర్పంచ్,సభ్యులు అక్కెనపల్లి నరేష్,మాజీ వార్డు మెంబర్, సభ్యులు బొడ్డు లచ్చయ్య, సుంకపాక దేవరాజ్, తదితర అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు



శ్రీకాళహస్తి ( ప్రశ్న న్యూస్) పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తిరుపతి పట్టణంలోని స్థానిక రవీంద్ర భారతి పాఠశాల,ఎంజీఎం పాఠశాల నందు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల నిర్వహణ సరళిని, పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, త్రాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి ఎండల దృష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్,అత్యవసర మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు తావులేకుండా పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని పరీక్షల నిర్వహణ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కలెక్టర్ గారి వెంట జిల్లా విద్యాశాఖాధికారి కె వి యన్ కుమార్ ఉన్నారు.

## పలు అభివృద్ధి పనులకు

# ఈజిఎస్ నిధులు మంజూరు

**- నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధి దిశగా కృషి చేస్తా**

**- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల్లో అభివృద్ధిలో భాగంగా నూతన సీసీ రోడ్ల నిర్మాణం,సైడ్ డ్రైన్ ల నిర్మాణానికి రూ.60 లక్షల ఈజీఎస్ నిధులు మంజూరు చేస్తూ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, వేములవాడ నియోజకవర్గం సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

# శ్రీలలిత ఆసుపత్రి వ్యర్థాలు, వాడిన సూదులు,సిరంజిలు

# అన్ని రోడ్డు పైనే



## అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆసుపత్రి యాజమాన్యం

- నోసోకోమియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం
- ఇలా ఐతే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితి ఏంటి
- రూ. 5000 జరిమానా విధించిన మున్సిపల్ కమిషనర్
- చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం : జిల్లా వైద్యాధికారి
- బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్, 2016 ఉల్లంఘన
- క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం 2010 ఉల్లంఘన




**జగిత్యాల బ్యూరో(ప్రశ్న న్యూస్)** జగిత్యాల బైపాస్ రోడ్డు, అశోక్ నగర్ లో గల శ్రీలలిత కిడ్నీ కేర్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ యాజమాన్యం, హాస్పిటల్ బయో వేస్ట్ వ్యర్థాలు తీసుకొని వచ్చి రోడ్డు ప్రక్క ఉన్న కెనాల్ పై పారేయడం వల్ల చుట్టు ప్రక్కల ఉన్న వారికి వ్యాధులు సోకే ప్రమాదం ఉందాని అంతే కాకుండా నీళ్లు కలుషితమై జంతువులకు, ప్రజలకు హాని కలిగే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని అంటున్నారు.

### శ్రీలలిత కిడ్నీ కేర్ ఆసుపత్రి వ్యర్థాలు ఇవే

సూదులు,సిరంజిలు,పగిలిన గాజు వంటి వ్యర్థ పదును వస్తువులు, రక్తం తో కూడిన దూది, మానవ కణజాలాలు, ఉపయోగించిన బ్యాండేజ్, డ్రెస్సింగ్‌లు, చేతి తొడుగులు, మూత్ర నాళ ట్యూబ్ లు, ద్రవ వ్యర్థాలు.

### బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ఉద్దేశ్యం

ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడటానికి బయోమెడికల్ వ్యర్థాలను సరైన నిర్వహణ చాలా ముఖ్యమైనది. బయోమెడికల్ వ్యర్థాలను సక్రమంగా పారవేయకపోవడం వల్ల అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి, ఆరోగ్య సంరక్షణ కార్మికులకు, సాధారణ ప్రజలకు ప్రమాదం ఏర్పడుతుంది. శ్రీలలిత కిడ్నీ కేర్ మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి చుట్టూ ఉన్న ప్రజలకు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పెను ప్రమాదం ప్రమాదకరమైన బయోమెడికల్ వ్యర్థాలకు గురికావడం వల్ల మానవ ఆరోగ్యానికి వ్యాధి లేదా గాయం కావచ్చు. వైద్య వ్యర్థాలను సరిగ్గా శుద్ధి చేయకపోవడం వల్ల HIV, హెపటైటిస్ B, C అనేవి సాధారణంగా వ్యాపించే మూడు వైరస్‌లు. కలుషితమైన సిరంజిలు మరియు సూదుల నుండి వచ్చే గాయాల ద్వారా ఇవి వ్యాపిస్తాయి. నోసోకోమియల్ ఇన్ఫెక్షన్లు న్యుమోనియా, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు, జీర్ణశయాంతర ఇన్ఫెక్షన్లు వస్తాయి.

### చట్టాల ఉల్లంఘన

**- బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్, 2016 ఉల్లంఘన**

**- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూల్స్ ఉల్లంఘన**

**- క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం, 2010 ఉల్లంఘన**

**రూ. 5000 జరిమానా :మున్సిపల్ కమిషనర్ చిరంజీవి**

జగిత్యాల బైపాస్ రోడ్డులో గల శ్రీలలిత కిడ్నీ కేర్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ యాజమాన్యం, హాస్పిటల్ బయో వేస్ట్ వ్యర్థాలు తీసుకొని వచ్చి రోడ్డు ప్రక్క ఉన్న కెనాల్ పై పారేశారనే విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ పూర్వా పరాలు పరిశీలించి, తన సిబ్బంది తో కలిసి చట్ట ప్రకారం రూ. 5000 జరిమానా విధించారని తెలిపారు.

**చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం:**
**జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్**

శ్రీలలిత కిడ్నీ కేర్ ఆసుపత్రి వ్యర్థాలు, సూదులు, సిరంజిలు, పగిలిన గాజు వంటి వ్యర్థ పదును వస్తువులు, రక్తం తో కూడిన దూది, మానవ కణజాలాలు, ఉపయోగించిన బ్యాండేజ్, డ్రెస్సింగ్‌లు, చేతి తొడుగులు, మూత్ర నాళ ట్యూబ్ లు, ద్రవ వ్యర్థాలు రోడ్డు ప్రక్క ఉన్న కెనాల్ పై పారేశారనే విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్ , నిజా నిజాలు పరిశీలించి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం, 2010 ప్రకారం తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

# ఎరుపెక్కిన ఎర్ర బంగారం

## - గిట్టుబాటు ధర లేక రైతులు కన్నెర్ర - దళారీలతో రైతులకు నిలువు మోసం



**అమరావతి(ప్రశ్న న్యూస్ )** ఎర్ర బంగారంగా పేరుగాంచిన మిర్చి పంట ధర దీనావస్థలో ఉంది. రైతు పరిస్థితి దిక్కుతోచని విధంగా తయారైంది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మిర్చి యార్డు గుంటూరు మిర్చి యార్డు. గుంటూరు కారం అంటే దేశంలోనే కాదు ప్రపంచంలోనే పేరు. పలనాడు పౌరుషానికి, పలనాడు యుద్ధానికి ఈ మిర్చి పంట కూడా మిర్చి ఘాటు కూడా ఒక కారణమే. సినిమా ప్రపంచం అంతా మిర్చి, కారం, మిరపకాయ పేర్లతో ఎన్నో సినిమాలు వచ్చాయి. పల్నాటి యుద్ధం, బ్రహ్మనాయుడు యుద్ధం మిర్చి కారం పౌరుషానికి ప్రతికలే. మిర్చి మసాలా రేడియో ఛానళ్ళు సినిమా పాటలు కూడా చూశాం. మసాలా కారం, కూర కారం మంట ఎక్కించాలంటే గుంటూరు మిర్చి తినాలని నానుడి. అలాంటి మంటేకిచ్చే గుంటూరు మిర్చికి ధర తగ్గింది. వినియోగదారుడిడిమాండ్ బాగానే ఉంది. పంట ఉత్పత్తి సాగు బాగా పెరిగింది. విదేశాల్లో సైతం రా రమ్మంటున్నారు. కాని యార్డులో మాత్రం రైతుకు పంటకు గిట్టుబాటు ధర లేదు. గత ఏడాది క్వింటా 20వేలు నుంచి 25 వేల వరకు పలికింది. ఈ ఏడాదికి వచ్చేసరికి నాలుగు వేల నుంచి పదివేల లోపు మాత్రమే క్వింటా ధర నడుస్తుంది. ఇదేమిటని యార్డు అధికారులను మిర్చి రైతులు నిలదీయగా ఎంతో కొంతకు అమ్ముకుని, తెగ నమ్ముకుని పొమ్మంటున్నారు. చేసేదేమీ లేదని ప్రభుత్వ అధికారులు చేతులెత్తేస్తున్నారు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వమే కాళ్లు పారేసింది. విధి లేక, గత్యంతరం లేక మిర్చి రైతులు రోడ్డున పడ్డారు. మరి కొంతమంది రైతులయితే మిర్చి పంటలు తగలబెట్టారు. గతంలో ఎన్నడూ చూడని ఇంత నీచమైన ధర ప్రస్తుతం రైతు ఎదుర్కొంటున్నాడు. కొంతమంది రైతులు కేవలం క్వింటా ధర 4వేలు పలకటంతో ఆత్మహత్యలకు ఒడిగొట్టవలసిన గత్యంతరం ఏర్పడింది. తమాయించుకుని మిర్చి యార్డులోనే తిరగబడ్డారు. అయినా ధర మాత్రం పెరగడం లేదు. మీడియా ఎంత గగ్గోలు పెట్టినా, ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అరుపులు కేకలు వేసిన మిర్చి ధర మాత్రం అటకెక్కి దిగనంటుంది. ఏమిటో ఈ మతలబు అర్థం కాక రైతు గగ్గోలు పడుతున్నాడు. వివరాల్లోకి వెళితే మిర్చి రైతు ఎకరానికి మూడు లక్షల వరకు ఖర్చు అవుతుంది. పెట్టుబడి విపరీతంగా పెట్టవలసి వస్తుంది. రైతు సహకార సంఘాలు, బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. అధిక వడ్డీకి బయట ప్రైవేటు వ్యక్తులు వద్ద అప్పు చేసి మరి పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నారు. చీడపీడల నుంచి పంటను పసిపిల్లలాగా కాపాడాలి. కౌలు కట్టాలి. అప్పులు కట్టాలి. వడ్డీ కట్టాలి. సాగు నీటి తీరువా కట్టాలి. విద్యుత్ బిల్లులు కట్టాలి. కూలీలకు కూలి చెల్లించాలి. తీరా పండిన పంటను మార్కెట్ యార్డుకు తెచ్చి అమ్మగా డీలపడ్డాడు. మిర్చి రైతు. కూలి ధర కిలోకి 30 రూపాయలు చెల్లించాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎకరానికి నాలుగు లక్షల వరకు ఖర్చు అవుతుంది. సాగు ఖర్చులు పెరిగిపోయాయి. దిగుబడి బాగానే వచ్చింది. మిర్చి పంటకు గిట్టుబాటు ధర మాత్రం రాలేదు. గత ఏడాది క్వింటాకు 20 నుంచి 25 వేల వరకు ధర పలకగా, ఈ ఏడాది నాలుగు వేల నుంచి పదివేల లోపు మాత్రమే ధర లభించింది. ఇందుకు గల కారణం రైతులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. గత ఏడాది ధర ఎక్కువగా ఉందని ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు మిర్చి పంట వేశారని అధిక ఉత్పత్తి వచ్చిందని డిమాండ్ లేకుండా పోయిందని అంటున్నారు. విదేశీ ఎగుమతులు కూడా బాగానే ఉన్నాయని చెబుతున్నారు. గుంటూరు మిర్చి యార్డు నుంచి విదేశాలకు ఎగుమతులు బాగా వెళతాయని చెబుతున్నారు. ప్రపంచంలోని శ్రీలంక, బంగ్లాదేశ్, చైనా, థాయిలాండ్, సింగపూర్, ఇండోనేషియా, మయన్మార్, టిబెట్, నెపాల్ తదితర దేశాలకు ఎగుమతి బాగా సాగుతుందంటున్నారు. కానీ మిర్చి యార్డ్ అధికారులు మాత్రం ఆర్డర్లు ఉన్నాయి గాని, ధర లేదని చెబుతున్నారు. అది ఎలా సాధ్యమో అర్థం కావటం లేదు. పంటకు డిమాండ్ ఉన్నప్పుడు ఆర్థిక సూత్రం ప్రకారం ధర పెరగాలి. అదే సందర్భంలో సప్లై బాగా ఉన్నప్పుడు ఉత్పత్తి బాగా ఉన్నప్పుడు ధర కూడా తగ్గుతుంది అనేది కూడా ఆర్థిక సూత్రం చెబుతుంది. ఈ రెండు వాస్తవాల అంగీకరించినప్పుడు విదేశీ ఆర్డర్లు ఉంటే డిమాండ్ పెరిగి ధర పెరగాలి. అదే సందర్భంలో సాగు ఉత్పత్తి బాగా పెరిగి, దిగుబడి బాగా పెరిగితే ధర తగ్గుతుంది అన్నది కూడా వాస్తమే. ఈ రెండు అంశాలు దృష్టిలో పెట్టుకుని అధికారులే ధర నిర్ణయించాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఈ అంశం పట్ల ఈ సమస్య పట్ల శ్రద్ధ వహించి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి రైతు పట్ల ఉదాసీన వైఖరి అవలంబించడం వల్ల రైతుకు తగిన గిట్టుబాటు ధర రాలేదనేది అర్థమవుతోంది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. రైతులు తిరగబడి మిర్చి యార్డును కూడా తగులబెట్టారు. కానీ అధికారుల మాత్రం మిర్చి ధర పెంచలేదు. గత ప్రభుత్వాలు క్వింటాకు 20 నుంచి 25 వేలు వరకు ధర ఎలా ఇచ్చారు. అందుకు గల కారణాలు ఏమిటి? ఈ ఏడాది ఎందుకు ధర తగ్గిపోయింది. ఎందుకు ధర ఇవ్వలేకపోతున్నారనేది ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. లేదంటే మిర్చి రైతులు చేసిన అప్పులు తీర్చలేక, కూలీలకు ఎరువులు పురుగుమందుల దుకాణదారులకు అప్పులు చెల్లించలేక, చేసిన అప్పులకు అసలు వడ్డీ కట్టలేక మిర్చి రైతు కూనరిల్లిపోతున్నాడు. పిల్లా పాపల చదువులు, కుటుంబ పోషణ భారంగా తయారయింది. ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఆదుకునే నాధుడు లేకపోతే గత్యంతరం లేక ఆత్మహత్యలు శరణ్యంగా భావిస్తున్నారు. మిర్చి రైతుని ఏ విధంగా ఆదుకుంటుందో దేశ ప్రజానీకం ఎదురుచూస్తున్నారు.

### కోల్డ్ స్టోరేజ్ లు బేజారు

రెండు రకాలుగా కోల్డ్ స్టోరేజ్ ల నిర్వహణ ఉంటుంది. ఈ రెండు రకాలు రైతులకు నష్టదాయకమే. మొదటి రకం ఏర్పాటు కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులే రైతుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి తమ కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ చేసుకుని అధిక ధరలకు అమ్ముకోవడం. రైతుల దగ్గర పంట ఉత్పత్తి తగ్గిన తర్వాత అధిక ధరకు మార్కెట్లో అమ్ముకోవడం. మరో రకం కోల్డ్ స్టోరేజ్ నిర్వహణ. ఈ రకం కేవలం రైతులే కోల్డ్ స్టేజిలో అద్దెకు తీసుకుని నిలువ చేసుకోవటం. ఈ విధానములో రైతులే తమ పంటను కోల్డ్ స్టోరేజ్లో నిలువ చేసుకొని రైతులే అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ధర లేక అద్దెలు చెల్లించలేక పెనుబారంగా తయారవుతుంది రెండో విధానం. ఈ రకంగా రైతులు తమ పంటను తామే నిలవ చేసుకుని అమ్ముకోవడం అనేది ఆచరణ అసాధ్యం. రైతు అన్ని రకాలుగా దోపిడీ గురవుతున్నాడు. తను పండించిన పంటకి గిట్టుబాటు ధర లభించడం లేదు. అందుకే ప్రభుత్వమే కోల్డ్ స్టోరేజ్ లు మార్కెట్ గిడ్డంగులు నిర్వహించాలి. రైతులకు పండించిన పంట కైనా పెట్టుబడి తో పాటు మరికొంత లాభం వేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. అప్పుడు మాత్రమే కష్టపడ్డా రైతుకి. పండించిన పంటకి కనీస మద్దతు ధర లభించినట్లు అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి రైతుల్ని ఈ రకమైన పద్ధతిలో ఆదుకోవాలని రైతాంగ కోరుకుంటున్నారు.

# హిందీ, ఇంగ్లీషు నేర్చుకుంటే తప్పేంటీ

## - నేరిస్తే ఢిల్లీతో కమ్యూనికేషన్ ఈజీ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** హిందీ వ్యతిరేకంగా తమిళనాడులో పెద్ద ఉద్యమంలో జరుగుతోంది. ఏకంగా అక్కడ రూపాయి సింబల్ హిందీలో ఉందని మార్చేసి రూ అని తమిళంలో పెట్టారు. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. పీ4 పేరుతో జరిగిన చర్చలో చంద్రబాబు భాషపై జరుగుతున్న వివాదంపై స్పందించారు. మాతృభాషకు ప్రాముఖ్యత ఇవ్వాలని అదే టైంలో కమ్యూనికేషన్‌కు జీవనోపాధికి అవసరమయ్యే ఏ భాష అయినా నేర్చుకోవాలని చంద్రబాబు సూచించారు. ఎన్ని భాషలైనా నేర్చుకుంటామని కానీ మాతృభాషను మాత్రం మర్చిపోమని అభిప్రాయపడ్డారు. మన దేశంలోని భాషలే కాకుండా విదేశ భాషలు కూడా నేర్చుకుంటున్నారని తెలిపారు. దీని వల్ల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని వివరించారు. “కొంతమంది ఇంగ్లీష్ జ్ఞానంతో సమానమని భావిస్తున్నట్లు అనిపిస్తుంది. భాష కమ్యూనికేషన్ కోసం మాత్రమే. అది జ్ఞానాన్ని తీసుకురాదు. మాతృభాషలో చదివినప్పుడు మంచి జ్ఞానం సంపాధిస్తారు. మాతృభాష నేర్చుకోవడం సులభం. అదే అనుభవంతో ప్రపంచంలో ఏ భాష అయినా నేర్చుకోవచ్చు” అని ఆయన అన్నారు. హిందీ నేర్చుకుంటే ఢిల్లీ వెళ్లినప్పుడు అక్కడ కమ్యూనికేషన్ సులభమవుతుందని అన్నారు. దీన్ని ఓ రాజకీయ అంశంగా చేసి వివాదాలు సృష్టించకుండా ఎన్ని భాషలు వీలైతే అన్ని భాషలు నేర్చుకోవలాని అసెంబ్లీ అభిప్రాయపడ్డారు. “జీవనోపాధి కోసం మనం ఎన్ని భాషలనైనా నేర్చుకుంటాం. మనం మాతృభాషను మర్చిపోం. భాష కమ్యూనికేషన్ కోసం మాత్రమే. ఎక్కువ భాషలు నేర్చుకోవడం ఉత్తమం,” అని చంద్రబాబు అన్నారు.

# ఇది గాంధీ భవన్ కాదు..అసెంబ్లీ

## - కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తి న అక్బరుద్దీన్ ఓవైసీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇది గాంధీ భవన్ కాదు.. అసెంబ్లీ అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సభ నిర్వహణపై ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా.. అధికార పక్షానికే ఎక్కువ సమయం కేటాయించడాన్ని ఓవైసీ తప్పుబట్టారు.అసెంబ్లీలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. సభలో మాట్లాడుదామంటే మైక్ ఇవ్వరు. అధికార పక్షం ఇలా చేయడం మంచిది కాదు. శాసనసభను నడపడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదు. ప్రశ్నలు కూడా మార్చుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం. అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి.. గాంధీ భవన్‌లా కాదు అని ఎమ్మెల్యే ఓవైసీ సూచించారు.

# స్కాలర్ షిప్ లను 2022లో కేంద్రం నిలిపివేసింది

## - రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడింది : మంత్రి సీతక్క



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** : పిల్లలకు పౌష్టికాహారం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి సీతక్క తెలిపారు. విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆమె శాసన సభలో మాట్లాడుతూ.. విద్యార్థుల కాస్మొటిక్ ఛార్జీలు కూడా 212 శాతం పెంచామని చెప్పారు. కల్తీ ఆహారం వంటి ఘటనలపై వెంటనే చర్యలు తీసుకున్నామని తెలియజేశారు. మహిళా ఐఎస్ అధికారులు నైట్ హాల్ట్ చేయాలని చెప్పామని, వివిధ హోదాల్లోని రాజకీయ నాయకులు కూడా నైట్ హాల్ట్ చేస్తున్నారని వెల్లడించారు. ఎనిమిదో తరగతి వరకు అందించే స్కాలర్ షిప్ లను 2022లో కేంద్రం నిలిపివేసిందని మండిపడ్డారు. కేంద్రం డైట్ ఛార్జీలు, స్కాలర్ షిప్ ల నిలిపివేతతో రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడిందని సీతక్క పేర్కొన్నారు.

# కేటీఆర్, హరీష్‌లతో తీన్మార్ మల్లన్న భేటీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్ కు గురైన తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు హరీష్, కేటీఆర్‌లతో సమావేశం అయ్యారు. బీసీ బిల్లు అంశంపై చర్చించినట్లుగా తెలు?సోతంది. బీసీ బిల్లు పై పోరాటం చేయాలని, బీసీలకు న్యాయం జరిగే విధంగా కొట్లాడాలని మల్లన్న కోరినట్లుగా తెలుస్తోంది. బీసీ కులగణన తప్పుల తడక అని ఆరోపించడమే కాకుండా ఆ నివేదికను చించేయడంతో మల్లన్నను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఆయన రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ క్రమంలో ఆయన కేటీఆర్, హరీష్ లతో చర్చలు జరపడం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ నేతలపై తీవ్ర విమర్శలు చేసేవారు. ఓ సందర్భంగా కేటీఆర్ కుటుంబసభ్యులపై కూడా వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై కేసులు పెట్టారు. బీఆర్ఎస్ హయాంలో ఆయనకు చెందిన క్యూ న్యూస్ ఆఫీసులపై చాలా సార్లు దాడులు జరిగాయి. పలు మార్లు జైలుకు వెళ్లారు. అయితే ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ విపక్షంలో ఉండటం బీసీ బిల్లు కోసం ఆ పార్టీతో కలిసి పోరాటం చేయాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశ పెట్టారు . ఈ బిల్లుకు బీఆర్ఎస్ కూడా మద్దతు తెలిపింది. అయితే చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమల్లోకి వచ్చినప్పుడు సంతోషిస్తామనని ఆ పార్టీ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఇప్పుడు బిల్లు ఆమోదం తర్వాత కేంద్రానికి పంపుతారు. కేంద్రం దాన్ని ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చాల్సి ఉటుంది. అలా చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాలి. ఈ రిజర్వేషన్ల పెంపుతో యాభై శాతం రిజర్వేషన్లు దాటిపోతాయి. అందుకే దీనికి చట్టబద్ధత కల్పించడం కేంద్రం చేతుల్లో ఉంటుంది. బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించేలా ఢిల్లీ వేదికగా ధర్నా చేయాలని తీన్మార్ మల్లన్న కూడా భావిస్తున్నారు. బీసీ సంఘాలతో కలిసి ఆయన ధర్నా చేయనున్నారు. తాము చేయబోయే ధర్నాకు మద్దతు ఇవ్వాల్సిందిగా తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ ను కోరుతున్నారు. కోటీఆర్, హరీష్ రావులు ఈ అంశంపై తీన్మార్ మల్లన్నకు ఇంకా ఏమీ చెప్పలేదని తెలుస్తోంది .తీన్మార్ మల్లన్న బీసీల మద్దతుగా తాను ముఖ్యమంత్రి అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయడంతో ఆయన ఏ రాజకీయ పార్టీలో చేరుతారా అన్న చర్చ జరుగుతోంది. అయితే తాను ఏ రాజకీయ పార్టీలో చేరుతానన్నది ఆయన చెప్పలేదు. ఆయన సొంత పార్టీ పెట్టుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ క్రమంలో ఆయన ధర్నాకు మద్దతు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా అన్నది సందేహంగా మారింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588